Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 10.08.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## • కులాలే దన్ను...

# ఓటు బ్యాంకులపై కన్ను





▶ టిడిపి సంప్రదాయ ఓట్లపై వైసిపి గురి

▶ వైసిపి ఓట్లకు ఎసరుపెడుతున్న టిడిపి

రాజకీయాలలో సమర్థమైన నాయకత్వం, నీతివంతమైన పాలన, సుస్థిర అభివృద్ధి, పేద, బడుగుల సంక్షేమం అనే అంశాల ప్రాధాన్యత క్రమంగా తగ్గిపోతోంది. గతంలో వీటి ఆధారంగానే ఎన్నికలలో రాజకీయ పార్టీల గెలుపోటములు వుండేవి. ఇప్పుడు వాటి స్థానాన్ని కులం, ధనం ఆక్రమించాయి. ఈ రెండింటి ప్రభావం ఎన్నికలపై ఎక్కువవుతుండడంతో అవినీతి పార్టీలు సైతం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగవుతున్నాయి. తాత్కాలిక కులం, ధనం ప్రయోగాల వల్ల ఐదేళ్ళ పాటు సాగిన ప్రభుత్వ అవినీతి, అరాచక పాలన కూడా తాత్కాలికంగా తెరమరుగయ్యే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. (మిగతా 11వ పేజీలో)



11లో

## ద్రవిడ సూరీడు అస్తమించాడు



## వైసిపిలోకి..

# రామ్‌కుమార్

### పార్టీలో జోరు... కేడర్‌లో హుషారు

3లో




## అరుపులు తప్ప...

# మెరుపులేవి?

> ఏపి బీజేపీ నేతల ప్రయాస > విమర్శలతో ఒరిగేదేముంది



***చంద్రబాబు అవినీతిపరుడు... పోలవరం ప్రాజెక్టులో అన్నీ అక్రమాలే! అంచనాలు కావాలనే పెంచారు. పట్టిసీమ ప్రాజెక్ట్‌లో 400కోట్ల అవినీతి జరిగింది. తెలుగుదేశం నాయకులు గనులను దోచేస్తున్నారు. సెజ్‌లు, రాజధాని పేరుతో భూ దోపిడీకి పాల్పడుతున్నారు... ఏపి బీజేపీ నాయకుల స్వోత్కర్ష ఇది. మా నుండి విడిపోయినా తెలుగుదేశం మా మిత్రపక్షమే! చంద్రబాబునాయుడు మా మిత్రుడే... లోక్‌సభలో రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటన ఇది!***

ఒకే పార్టీ రెండు దారులు... బీజేపీలోనే ఒక పార్టీ విషయంలో విభిన్న ధోరణులు. ఏపిలోని బీజేపీ నాయకులు మొదటి నుండి చంద్రబాబు ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూనే వున్నారు. 2014 ఎన్నికలప్పుడే తెలుగుదేశంతో పొత్తును బలంగా వ్యతిరేకించారు ఏపి బీజేపీ నాయకులు. కాని, కొన్ని అదృశ్యశక్తుల కృషి ఫలితంగా రెండు పార్టీలకూ పొత్తు కుదిరింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీకి బీజేపీ మిత్రపక్షంగా కంటే శత్రుపక్షంగానే ఎక్కువుగా పనిచేసింది. మొన్నటివరకు బీజేపీలో టీడీపీ అనుకూల మరియు వ్యతిరేక వర్గాలుండేవి. రాజధాని భూముల వ్యవహారం, ఓటు-నోటు కేసు, పోలవరం అంచనాల పెంపు, పుష్కరాల మృతి, పట్టిసీమ అవినీతి, యధేచ్ఛగా గనుల తవ్వకాలు, అధికారపార్టీ నేతల దురాగతాలపై సభలోనూ, బయట బీజేపీ నాయకులు చీల్చి చెండాడుతూ వచ్చారు.

ఇటీవల ఎన్డీఏ నుండి తెలుగుదేశం బయటకు వచ్చాక బీజేపీ నాయకులు చంద్రబాబుపై చేసే విమర్శలకు మరింతగా పదును పెట్టారు. తెలుగుదేశం అవినీతి అక్రమాలపై దాడి ముమ్మరం చేసారు. సోము వీర్రాజు, విష్ణుకుమార్‌రాజు, కన్నా లక్ష్మీనారాయణ, జిపిఎల్ నరసింహారావు వుంటి బీజేపీ నాయకులు వైసిపితో పోటీ పడుతూ చంద్రబాబు పాలనను తూర్పారబడుతున్నారు. (మిగతా 11వ పేజీలో)



# విష వలయుంతో... నెల్లూరు విలవిల



- అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా సింహపురి
- నిపుణుల హెచ్చరికలు..పట్టించుకోని పాలకులు

*దేశంలో అత్యంత కాలుష్యమైన నగరాలు 14 ఉంటే, అందులో నెల్లూరు కూడా ఒకటని తాజాగా నిపుణుల హెచ్చరిక చూస్తే..నెల్లూరెంతగా కాలుష్యంలో కూరుకుపోతోందో..అనారోగ్యకర వాతావరణంలో పడి ఈ సుందర నగరం ఎంతగా విలవిలలాడిపోతోందో తేటతెల్లమవుతుంది. చూడచక్కని పచ్చని ప్రకృతి వాతావరణంతో, చల్లని గాలులతో గతంలో ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న నెల్లూరు..ఇప్పుడు సెగలు పొగలతో నిండిపోతోంది. ఎటుచూసినా కాలుష్యంతో...దుమ్ము-ధూళితో నిండిపోతోంది. నెల్లూరు చరిత్రలోనే ఇంతటి దుర్గతి ఎప్పుడూ లేదు..అయినా, నగర పాలకుల్లో కానీ, అధికారుల్లో కానీ చలనం ఉండడం లేదు.*

నెల్లూరు నగరవాసులకు..ఇక పాత నెల్లూరు ఒక మధురజ్ఞాపకంగానే మిగిలిపోయేట్టుంది. ఆ ప్రశాంతమైన వాతావరణం, ఎటు చూసినా చెట్లు..పచ్చదనం, పెన్నానది గలగలలు, పక్షుల కిలకిలలు.. సముద్రపు గాలుల చల్లదనం ఇవన్నీ ఇక ఊహించుకుంటూ బతకాల్సిందే. ఆ ఆనందకర పరిస్థితులను కలగనాల్సిందే తప్ప..మనకిక కనిపించవు. ఇప్పుడు మనం పీల్చే గాలి..తాగే నీరు అన్నీ కలుషితమైపోయాయి. ఎటుచూసినా కాలుష్యం కోరలు చాస్తూనే ఉంది. చల్లదనం అన్నది ఆవిరైపోయి, నెల్లూరు కాలుతున్న పెనంలా సెగలుపొగలతో అట్టుడికిపోతోంది. కారణాలు అందరికీ తెలిసినవే...చెట్లు మటుమాయం అయ్యాయి. ప్రధానవీధుల్లోనే కాదు, చిన్నచిన్న వీధుల్లోని పెద్దపెద్ద చెట్లు కూడా రోడ్లకి బలైపోయాయి. వానలు లేవు..రుతువులే మారిపోయాయి. సకాల వర్షాలతో పచ్చదనం పరవళ్ళతో ఉన్న నెల్లూరు ఇప్పుడు.. ఏడాదంతా మండుటెండగానే మండుతోంది. దీనికి తోడు నగరంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. గతంలో ఎన్నడూ లేనంతగా నెల్లూరులో ఆటోలు గణనీయంగా పెరిగిపోయాయి. వాటి సంఖ్య కనీసం పాతికవేలకు పైగానే ఉంటుందన్నా ఆశ్చర్యం లేదు. ఇవి కాక, వేలాది బస్సులు, లారీలు, లక్షలసంఖ్యలో ద్విచక్రవాహనాలు.. వెరసి ఎక్కడ చూసినా వాటి తాలూకు కాలుష్యం గాలిలో కలిసిపోయి.. ప్రజల ఆరోగ్యం కూడా గాలిలోనే కలిసిపోతోంది. అందులోనూ ఇటీవల నగరంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు క్రమబద్ధంగా లేక ఇష్టారాజ్యంగా జరుగుతుండడం, ఎక్కడంటే అక్కడ రోడ్డంతా తవ్వేసి అనేకచోట్ల అలాగే నెలల తరబడి ఉంచేయడం వల్ల పరిసరాలన్నీ దుమ్ము ధూళితో నిండిపోతున్నాయి. ఎన్నిసార్లు ఎవరెంతగా మొత్తుకున్నా పట్టించుకున్నవారు లేరు. ఫలితంగా రకరకాల జబ్బులు, శ్వాసకోశ వ్యాధులతో నగర ప్రజలు ఎంతోకాలంగా ఈ బాధలతో నరకయాతన పడుతూనే ఉన్నారు.

సింహపురి సమాచారం

### అంతా కాలుష్యమయం...

నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. పరిశ్రమల కాలుష్యం, వాహనాల కాలుష్యం.. ఒకటేమిటి ఎక్కడ చూసినా అంతా కాలుష్యమే. పరిశ్రమల ద్వారా, థర్మల్ కేంద్రాల ద్వారా కాలుష్యం పెరిగిపోతోందని నిపుణులు చెప్తున్నా ఆలకించేవారు లేరు. కాలుష్యం పెరగడం వల్ల గాలిలో స్వచ్ఛత తగ్గిపోతోందని అటు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రపంచ ఆరోగ్య సంస్థలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నా అటు నగరపాలకులు కానీ, ఇటు అధికారగణం కానీ వినిపించుకోవడం లేదు. కాలుష్యాన్ని నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని, కాలుష్యాన్ని నివారించుకోవాలని చెప్పడమే తప్ప పరిశ్రమల నుంచి, వాహనాల నుంచి పెద్దఎత్తున విరుచుకుపడుతున్న కాలుష్య నివారణ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

### అగ్నిగుండంగా నెల్లూరు...

నెల్లూరంటే.. చల్లని ఆహ్లాదకర వాతావరణానికి ప్రసిద్ధి. జిల్లా అంతా పచ్చదనానికి కొరత లేకుండా ఉండేది. ముక్కారు (ఏడాదికి మూడు కార్లు) పండే నెల్లూరుసీమలో ఇప్పుడు వానలు కురవడానికే భయపడిపోతున్నాయి. పొరపాటున ఎప్పుడన్నా ఒక చినుకు రాలినా.. మళ్లీ అంతలోనే మబ్బులన్నీ ఈ సెగలు చూసి 'అమ్మో ఇది నెల్లూరా' అంటూ భయపడి వెనక్కి మళ్ళిపోతున్నాయి. బోలెడంత సముద్రతీరం మనకున్నా..చల్లదనం అన్నదే కరువైపోయింది. జిల్లా ఇప్పుడు వర్షాభావంతో.. కరువుతో అల్లాడుతోంది. పంటలు ఎండిపోతున్నాయి. చివరికి తాగేందుకు గుక్కెడు నీళ్ళు దొరకని దుస్థితి కూడా నెల్లూరుసీమలో దాపురిస్తున్నదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. ఇలాంటి పరిస్థితి ఇన్నేళ్ల నెల్లూరు చరిత్రలో ఎప్పుడూ లేదు. వర్షాకాలం వస్తే ఆగకుండా వానలు కురిసేవి. ఇప్పుడు ఎండలదే రాజ్యం. పెన్నానదిని కూడా ఇప్పుడు శుభ్రంగా ఎండబెట్టేశారు. హాయిగా అక్కడ క్రికెట్టో.. కుందుడుకుమ్మో ఆడుకోవచ్చు అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఎప్పుడన్నా కనికరించి సోమశిల నుంచి నీళ్ళొస్తే ఆ నదిలో ఒక చిన్న పాయ సెలయేటికాలువలా పారుతుంది. దానికే సంబరపడాలిప్పుడు. ఈ కష్టాలన్నిటికీ కాలుష్యం భయంకరంగా పెరిగిపోవడమే ప్రధాన కారణం. ఈ దుస్థితి ఇలాగా కొనసాగితే నెల్లూరు అగ్నిగుండంలా మారిపోతుందన్నా అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు, అధికారులు అందరూ కలిసి కాలుష్యనివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా ఈ కృషిలో భాగస్వాములై కాలుష్యాన్ని తరిమికొట్టేందుకు సహకరిస్తూ.. సింహపురిని స్వచ్ఛపురిగా...పచ్చదనాల సిరిగా మార్చుకోవాలి.

---

## బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయం

### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



రాష్ట్రంలో వైఎస్సార్సీపి అధికారంలోకి రావడం తథ్యమని, జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రజల అభ్యున్నతి కోసం మరింతగా కృషి చేస్తామని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 6న ఆయన సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తమ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తామన్నారు. తడను నగర పంచాయతీ చేయాలని, సూళ్ళూరుపేట-నాయుడుపేటల్లో రెండో పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తానని, సముద్ర తీరప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. తెలుగుగంగ బ్రాంచ్ కాలువలను తవ్వించి చెరువులకు నీరందించేందుకు, దొరవారిసత్రం మండలంలో గురుకుల పాఠశాల, తడ మండలంలో మత్స్యకారుల గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో మహనేత వైఎస్ హయంలో ప్రారంభమైన మూడు సెజ్‌లలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషిచేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు కళత్తూరు శేఖరరెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, తిరుమూరు రవిరెడ్డి, ముత్తుకూరు లక్ష్మమ్మ, గోగుల తిరుపాలు, తుపాకుల ప్రసాద్, బుంగా చెంగయ్య, సన్నారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా దశరధరామిరెడ్డి

జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శిగా ప్రస్తుతం ఈదూరు జడ్పీహైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బి. దశరధరామిరెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు డిఇఓ శ్యామ్యూల్ ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2018-19, 2019-20 విద్యాసంవత్సరాలకు ఆయన క్రీడాసమాఖ్య కార్యదర్శిగా పనిచేయనున్నారు. దశరధరామిరెడ్డి నియామకం పట్ల జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కృష్ణారెడ్డి, ఎన్.విక్టర్, నాయకులు సనత్‌కుమార్, గురుప్రసాద్, థామస్‌పీటర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పేరుతో ప్రజల్ని దోచుకుంటున్నారు

### - టిడిపి నాయకులపై కాకాణి విమర్శ

చంద్రబాబునాయుడు పాలన అంతా అవినీతిమయమని, రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. వెంకటాచలం మండలంలోని సర్వేపల్లిలో ఈ నెల 5న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి 50 నెలలయ్యాక చంద్రబాబు నాయుడికి అప్పుడిచ్చిన హామీలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. సబ్సిడీ రుణాలు, నిరుద్యోగభృతి, రుణమాఫీ, ఉద్యోగాల కల్పన అంటూ ఎన్నో హామీలిచ్చి వాటిని అమలుచేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో టిడిపి ఉనికి దాదాపుగా కోల్పోయిందన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారంటూ ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఈ సమావేశంలో కాకాణితో పాటు, వైఎస్సార్సీపి నాయకులు కనుపూరు కోదండరామిరెడ్డి, కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, జడ్పీటిసి వెంకటశేషయ్య, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌నాయుడు, విజయభాస్కర నాయుడు, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తడలో తప్ప జిల్లా అంతా కరువే!

జిల్లాలో కరువు మేఘాలు కమ్ముకున్నాయని, కరువుతో ప్రజలు, రైతులు అల్లాడుతున్నారని ఎట్టకేలకు ప్రభుత్వం గుర్తించింది. కరువు బృందం పరిశీలనతో జిల్లాను కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా పరిస్థితిని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు కొద్ది నెలల క్రితమే అన్ని మండలాల్లో ప్రత్యేకబృందాలను పంపి నివేదికలు తయారుచేయించి కరువు పరిశీలన బృందానికి నివేదించారు. జిల్లాలోని తడ మండలం మినహా, మిగిలిన 45 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో సాగునీరు అందుబాటులో లేక అనేకప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు తాగునీటికి కూడా కటకటపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలోని 45మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ప్రభుత్వం వెంటనే కరువు సాయం మంజూరుచేసి బాధిత రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలి.

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

## నేత్ర వైద్యశిబిరం

నెల్లూరులోని లయన్స్‌క్లబ్, మోడరన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5న నగరంలోని ముత్తుకూరురోడ్డులో ఉన్న లయన్స్‌క్లబ్ భవనంలో 60 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారని, వీరికి మోడరన్ ఐ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నామని ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రాజు, మురళీకృష్ణ తెలిపారు. సామాజిక సేవలో భాగంగా తాము ప్రతినెలా మొదటి ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, ఖాసిం, సత్యం, శ్రీధర్ పాల్గొన్నారు.

### శ్రీ రంగనాథుని దర్శించుకున్న

## ట్రైనీ కలెక్టర్

నెల్లూరు ట్రైనీ కలెక్టర్ మధుసూదన్ ఈనెల 5న కుటుంబసభ్యులతో కలసి నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఇ.ఓ జనార్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు స్వాగతించి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు.




# ఆనం పెత్తనానికి తెర

## విఆర్‌సి ప్రత్యేక అధికారిగా జేసికి బాధ్యతలు



విఆర్ విద్యా సంస్థలు... నెల్లూరుజిల్లా విద్యా రంగానికే తలమానికం! వెంకటగిరి రాజాలచే నెలకొల్పబడిన ఈ విద్యాసంస్థలపై మొదట్లో వారి పెత్తనమే వుండేది. వారి తర్వాత ఆనం కుటుంబం పెత్తనం మొదలైంది. దాదాపు 50ఏళ్ళుగా ఆ కుటుంబసభ్యుల కనుసన్నలలోనే ఈ విద్యా సంస్థ నడుస్తూ వచ్చింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఆనం వివేకానందరెడ్డి కరస్పాండెంట్‌గా వున్న విఆర్ విద్యా సంస్థల కమిటీని గత ఏడాది రద్దు చేస్తూ హైకోర్టు తీర్పును వెలువరించడం తెలిసిందే! ఆనం వివేకానందరెడ్డితో పాటు ఆనం రామనారాయణరెడ్డి, మరికొందరు సభ్యులు ఈ కమిటీలో వున్నారు. అయితే ఈ కమిటీ ఎన్నికలు అక్రమంగా జరిగాయని, పూర్వవిద్యార్థుల ఓట్లు తొలగించి ఎన్నికలు జరిపారని, ఈ కమిటీని రద్దు చేయాలంటూ బీజేపీ నాయకులు ఆమంచర్ల శంకరనారాయణ పట్టువదలని విక్రమార్కుడిలా పాతికేళ్ళ నుండి న్యాయస్థానాలలో పోరాడుతూ వచ్చాడు. ఎట్టకేలకు ఆయన పోరాటం ఫలించి ఆ కమిటీని రద్దు చేయాలని, కొత్త కమిటీని ఎన్నుకునే వరకు ప్రత్యేకాధికారిని నియమించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే మొన్నటి వరకు ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలోనే వుండడంతో ప్రభుత్వం విఆర్ విద్యాసంస్థలకు ప్రత్యేక అధికారిని నియమించకుండా నెట్టుకొచ్చింది. ఇప్పుడు ఆయన టీడీపీని వీడి వైసిపిలో చేరబోతున్నాడు. ఇక ఆయనతో తమకు మొహమాటం లేకుండా పోయింది. దీంతో విఆర్ విద్యాసంస్థలకు జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్విని ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విఆర్‌పై ఆనం ఆధిపత్యానికి తెరదించినట్లయ్యింది.

# విశ్వాసాలకు ప్రతీక బారాషహీద్ దర్గా

### - ఎమ్మెల్యే కోటంరెడ్డి



దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల విశ్వాసానికి నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రతీక అని, అలాంటి దర్గా పవిత్రతను కాపాడేందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈ నెల 7వ తేదీన ఆయన దర్గామిట్టలోని బారాషహీద్ దర్గాను సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది రొట్టెల పండుగ సందర్భంగా 20కోట్లతో చేసిన పనులలో ఒక్కటీ సక్రమంగా లేదన్నాడు. నాసిరకం కట్టడాలతో నిధులను దుర్వినియోగం చేసారని విమర్శించాడు. గత ఏడాది నిర్మించిన ఘాట్‌లు, మరుగుదొడ్లు పాడైపోయాయి. పచ్చదనం పేరుతో నాటిన మొక్కలు ఎండిపోయాయి. దర్గా ప్రాంగణంలో సెక్యూరిటీ, పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతో అసాంఘిక శక్తులు ఈ మైదానాన్ని ఓపెన్ బార్‌లా వాడుకుంటున్నాయి. దీనిపై రెండురోజుల క్రితం ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. దర్గా పవిత్రతను కాపాడడం మీకు చేతకాకుంటే నేనే స్వయంగా రంగంలోకి దిగి దర్గాకు కాపలాదారుగా పని చేస్తానని ఆయన హెచ్చరించాడు. వచ్చే రొట్టెలపండుగ కోసం 20కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేయకపోతే పూరుకునే ప్రసక్తే లేదన్నారు. పవిత్ర బారాషహీద్ దర్గాను నీచ రాజకీయాలకు, అవినీతి దాహానికి వాడుకోవద్దని, రాజకీయాలకు అతీతంగా దర్గా పవిత్రతను కాపాడుదామని ఆయన పిలుపునిచ్చాడు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు, వైసిపి నాయకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, హజరత్‌నాయుడు, డాక్టర్ సత్తార్, అబూబకర్, హంజాహుస్సేని తదితరులు పాల్గొన్నారు.

# వైసిపిలోకి.. రామ్‌కుమార్

## వెంకటగిరి కేడర్‌లో ఫుల్ జోష్... అదిరిపోనున్న మాజీ సీఎంల తనయుల కాంబినేషన్

నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో నిన్నటితరం, నేటి తరం, రేపటి తరాలకు గుర్తుండిపోయే నాయకుడు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. సాధారణ ఉపాధ్యాయుడిగా రాజకీయ రంగంలోకి వచ్చి జిల్లాస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదిగిన నాయకుడు. ఎందరికో రాజకీయ భవిష్యత్తును కల్పించిన రాజకీయయోధుడు. రాజకీయాలలో రాణించాలనుకునేవారికి ఆయనొక యూనివర్శిటీ లాంటోడు. ఆయన రాజకీయ విశ్వవిద్యాలయం నుండి నేటి రాష్ట్ర రాజకీయాలలోకి చాలామంది నాయకులు పుట్టుకొచ్చారు. ఎమ్మెల్యే నుండి ముఖ్యమంత్రి దాకా ఎన్నో పదవులు చేపట్టినా ఆయనెప్పుడూ రాజకీయ వారసత్వం గురించి ఆలోచించలేదు. తన తర్వాత తన కొడుకులకు పదవులు దక్కాలనుకోలేదు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి నలుగురు కొడుకులున్న ప్పటికీ వారిలో రాజకీయాలలోకి ఆలస్యంగా వచ్చింది, అందులోనూ తండ్రి బ్రాండ్‌ను వాడు కోకుండా రాజకీయంగా సొంతంగా అడుగులు వేస్తున్నది నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డే!


ప్రజాసంకల్పయాత్రలో జగన్‌ను కలిసిన రామ్‌కుమార్

తన తండ్రి తుదిశ్వాస విడిచిన కాంగ్రెస్‌పార్టీలో నుండే రాజకీయ ప్రయాణం మొదలుపెట్టిన రాం కుమార్‌రెడ్డి... 2014లో వెంకటగిరి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా నిల బడ్డాడు. విభజన మూలంగా రాష్ట్రంలోనే కాంగ్రెస్ మట్టికొట్టుకు పోయిన పరిస్థితుల్లో ఆయన వెంకటగిరి నుండి ఓడిపోయాడు. ఎన్నికల అనంతరం ప్రస్తుత ఉపరాష్ట్రపతి, అప్పటి కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఆశీస్సులతో బీజేపీలో చేరాడు. ఈ నాలుగేళ్ళు బీజేపీలో బాగానే పని చేసాడు. అయితే రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం, రాష్ట్ర ప్రజల్లో బీజేపీ నమ్మకద్రోహం చేసిందన్న అభిప్రాయం తదితర కారణాలైతేనేమీ, జగన్ నాయకత్వంలో పనిచేయాలన్న అభిలాషయితేనేమీ రామ్‌కుమార్ ఆలోచనలు వైసిపి వైపు మళ్లేలా చేసాయి.

ఇటీవల ప్రకటించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఆయనను కార్యదర్శిగా నియమించారు. అయితే ఈ పదవిని ప్రకటించిన పదిగంటల్లోపే ఆయన తూర్పుగోదావరి జిల్లాలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహిస్తున్న వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలుసుకున్నాడు. వైసిపిలో చేరి ఒక కార్యకర్తగా పనిచేయడానికి సంసిద్ధత తెలిపాడు. అంతేకాదు, ఎటువంటి పదవులు, ఎలాంటి సీట్లు ఆశించకుండానే ఆయన బీజేపీని వదిలి వైసిపిలో చేరబోతున్నాడు.

జిల్లాలో ఒక బలమైన వర్గం నేదురుమల్లిది. వెంకటగిరి అసెంబ్లీతో పాటు గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాలపై నేదురుమల్లి ప్రభావం ఉంటుంది. నేదురుమల్లి రామ్‌కుమార్ రాకతో ఈ మూడు నియోజకవర్గాలలోనూ వైకాపాకు అదనపు బలం వచ్చినట్లే! రేపు అసెంబ్లీల వారీగా అభ్యర్థుల ఎంపికలో కూడా వెంకటగిరికి సమర్థులైన అభ్యర్థులలో ఒకడు కాగలడు.

జగన్ తండ్రి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా, సీనియర్ కాంగ్రెస్ నేతగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆయనకు ఎంతగానో సహకరించారు. వై.యస్. పరిపాలనను జనార్ధన్‌రెడ్డి పలుమార్లు ప్రశంసల్లో ముంచెత్తారు. ఇప్పుడు వై.యస్. వారసుడు జగన్ నడుపుతున్న పార్టీలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేరుతున్నాడు. తండ్రుల బంధం లాగే ఈ తనయుల బంధం కూడా బలపడాలని, జగన్ సారథ్యంలో రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైకాపా మరింత పటిష్టంగా తయా రవ్వాలని అభిమానులు కోరుకుం టున్నారు.

### శ్రావణంలోనే ఆనం...

మాజీమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి కూడా ఈ నెలలోనే జగన్ సమక్షంలో వైసిపిలో చేరను న్నాడని తెలుస్తోంది. ఆషాఢ మాసం అని ఆయన వేచి చూస్తున్నాడు అని అంటున్నారు. శ్రావణ మాసంలో జగన్ పాదయాత్ర విశాఖలోకి ప్రవే శించగానే విశాఖ వేదికగా ఆయన పార్టీలో చేరనున్నాడని సమాచారం.

అటు 'రామ్' ఇటు 'నారాయణ' ఇద్దరూ వైకాపా తీర్థం పుచ్చుకోవడం జగన్‌రెడ్డి పార్టీకి జిల్లాలో మరింత బలం చేకూరినట్లే. అయితే ఇక్కడ రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి రావడం పార్టీకి మంచి అండగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. రామ్‌కుమార్ వల్ల జిల్లా మొత్తం వున్న నేదురుమల్లి అభిమానులు ఆనందంలో వున్నారని, వారంతా వై.యస్.ఆర్ కాంగ్రెస్‌వైపే మొగ్గుచూపుతారన్నది వారి ఆలోచన.

అయితే రామనారాయణరెడ్డి పార్టీలోకి రావడం ఎక్కువ మందికి మింగుడు పడడం లేదు. ఆయన వచ్చినందువల్ల పార్టీ జెండా ఆయనకు లాభపడుతుందే తప్ప, ఆయన వల్ల పార్టీకి పెద్దగా ఒరిగేదేమీ లేదన్నది వారి వాదన. అయితే, రామ్‌కుమార్ రెడ్డి తాను జగన్‌ను కలవడం, వెంటనే నిర్ణయం ప్రకటించడం... వెంట వెంటనే జరిగిపోయాయి. కాని, రామనారాయణరెడ్డి మాత్రం ఇంకా విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఆనం మార్కు రాజకీయాన్ని చేస్తున్నాడు. పైగా ఇప్పటికే వెంకటగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా వున్న రాఘవేంద్రరెడ్డికి రామ్‌కుమార్‌కి మంచి సంబంధాలు వున్న తరుణంలో వీరిద్దరినీ కాదని అక్కడ రామనారాయణకి టిక్కెట్ ఇవ్వడం కూడా సమంజసం కాదని, అలా ఇస్తే పార్టీ వర్గాల్లో అసంతృప్తి చెలరేగే అవకాశం వుందని రాజకీయ మేధావుల విశ్లేషణ. ఈ తరుణంలో పార్టీ టిక్కెట్ ఎవరిని వరిస్తుందోనన్నది కూడా పెద్ద చర్చ నీయాంశంగా మారింది. ఏదిఏమైనా... ఒక ప్రజాముఖ్యమంత్రి కుమారుడికి అండగా మరో మాజీముఖ్యమంత్రి తనయుడు నిలవడం పార్టీకి శుభపరిణామం.

## పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# మెగా వైద్యశిబిరం





ఈ నెల 5వ తేదీన కోటలోని యం.జె.పి.ఏ.పి.బి.సి.డబ్ల్యు స్కూల్ నందు పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య మరియు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కోట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వెయ్యిమందికి పైగా రోగులకు వైద్యుల చేత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వచ్చిన అందరికీ మధ్యాహ్న భోజన వసతిని కల్పించారు. అలాగే రక్తదాన శిబిరంలో 300కు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఈ సేవా శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోట తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎం.ఇ.ఓ ఎం.వి.సునీల్‌కుమార్, నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ యూనిట్ హెడ్ నవీన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు హరిప్రసాద్‌రెడ్డి, కోట జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# ఈ దారుణాలకు అంతమెప్పుడు?

**దేశంలో ప్రతినిత్యం ఎక్కడో ఓచోట అబలలపై అత్యాచారాలు, బాలికలపై లైంగికదాడులు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇటీవల బీహార్‌లోని ఓ అనాధాశ్రమంలో పలువురు బాలికలపై కామపిశాచాల వికృతహేల దేశ ప్రజలను కంటతడి పెట్టించింది. ఇలాంటి లైంగిక నేరాలను అరికట్టేందుకు చట్టాలు ఎంతో పకడ్బందీగా ఉన్నా.. వాటిని పటిష్టంగా అమలు చేయలేకపోవడమే పెద్ద లోపం. ఇకనైనా ఇలాంటి పైశాచికమూకల ఆటకట్టించడానికి ప్రభుత్వాలు, అధికారయంత్రాంగం గట్టి చర్యలు తీసుకోవాలి.**

దేశంలో నానాటికీ చిన్నపిల్లలు, యువతులు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అబలలపై అత్యాచారాలు, అమాయక బాలికలపై ఘోరాలతో దేశం అట్టుడికిపోతూనే ఉంది. దేశవ్యాప్తంగా అనేక దారుణ ఉదంతాలు ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. ఇటీవల బీహార్‌లో..కనీసం మానవత్వం లేని కామపిశాచాల రాక్షసప్రవృత్తి దేశప్రజలను కంటతడిపెట్టించింది. తమకంటూ ఎవరూలేని అసహాయులైన అనాధబాలికలను కూడా చిదిమేయడం చూసి సభ్యసమాజం సిగ్గుతో తలదించుకుంటోంది. దేశంలో నానాటికీ అనేకప్రాంతాల్లో ఇలాంటి హింసలు పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే జమ్ము కశ్మీర్‌లోని కథువా, ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతాల్లో జరిగిన పైశాచిక ఘటనల్లో అమాయక బాలికలపై జరిగిన ఘోరమైన అత్యాచారాలతో దేశం అట్టుడికిపోయింది. దీంతో లైంగిక నేరాలకు పాల్పడేవారిపై మరింత కఠినశిక్షలను వేయడానికి అవసరమైన బిల్లులను లోక్‌సభ ఆమోదించడంతో, బాలికలపై అత్యాచారాలు చేసేవారికి మరణదండన విధించాలనే గట్టి నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం. అయినప్పటికీ ఇలాంటి నేరాలు ఘోరాలు తగ్గకపోవడమే విచారకరం. చట్టాలు ఎంత పటిష్టంగా ఉన్నా వాటిని పకడ్బందీగా అమలుచేయలేకపోవడమే లోపం అనిపిస్తోంది.

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు గతంలో కంటే బాగా పెరిగిపోతున్నాయని, గతంతో పోలిస్తే ఇప్పుడు 83 శాతం పెరిగాయని, అందులోనూ దేశంలో అత్యాచారాలకు గురవుతున్నవారిలో అత్యధిక శాతం మైనర్లేనని, గత పదేళ్ళతో పోలిస్తే వీటి సంఖ్య అయిదింతలు పెరిగిందని కూడా జాతీయ నేరగణాంక సంస్థ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతినిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలపై, బాలికలపై కామపిశాచాలు అత్యంత పైశాచికత్వంగా దారుణాలకు ఒడిగడుతూనే ఉన్నాయి. అమాయక బాలికలను, యాచకుల పిల్లలను తీసుకొచ్చి వారిచేత వ్యభిచారం చేయిస్తున్న ఘోరాలు తాజాగా తెలుగు రాష్ట్రాల్లోనూ అక్కడక్కడా బయటపడుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇలా బాలికల పట్ల అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయనేందుకు తాజాగా బీహార్‌లోని ముజఫర్‌పూర్ ఘటనే ఒక పెద్ద ఉదాహరణ. అక్కడ ఓ బాలికల అనాధాశ్రమంలో మైనర్‌బాలికలపై సాగిన అఘాయిత్యాల పరంపర దేశాన్నే దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అక్కడున్న 30మందికి పైగా బాలికలపై నెలల తరబడి అక్కడి సిబ్బంది జరిపిన లైంగిక దాడుల కథనాలు వింటే, దేశంలో కామపిశాచాలు ఎంతగా వీరవిహారం చేస్తున్నాయో అర్థమవుతుంది. బీహార్‌లోని అనాధాశ్రమాల్లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వారు జరిపిన సామాజిక తనిఖీల్లో ఈ అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడి అనాధాశ్రమ నిర్వాహకుడు అనాధాశ్రమంలోని పసిమొగ్గలను బలిపెట్టేందుకు, వచ్చినవారిని రహస్యంగా అనాధాశ్రమంలోకి పంపేందుకు ఏకంగా రహస్య మార్గాలను ఏర్పరచడం, అన్నంలో మత్తుమందు కలిపి బాలికలపై అత్యాచారాలు సాగించడం, అందుకు ఎవరైనా ఎదురుతిరిగితే వారిని తీవ్రంగా కొట్టడం వంటివి అక్కడ నిత్యకృత్యాలని తేలింది. ఆ హింసలను తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించారట కూడా. ఇదే అనాధాశ్రమంలో 11మంది యువతులు కూడా కన్పించడం లేదనే సమాచారం ఆ తర్వాత వెలుగులోకి వచ్చింది. వారేమైపోయారో.. లేక వారినేమిచేశారో తేలాల్సి ఉంది. ఇలాంటి అకృత్యాల ఆశ్రమాలు బీహార్‌లో అదొక్కటే కాదు.. ఇంకా అనేకం ఉన్నాయనేది మరో నిర్ఘాంతపోయే సమాచారం. దేశవ్యాప్తంగా అనాధాశ్రమాల్లో, వసతిగృహాల్లో తనిఖీలు లేకపోవడం, నిఘా వ్యవస్థలు నిద్రపోతుండడం, ఇదే అదనుగా అబలలను, అమాయకులను ఏమి చేసినా ఎవరూ అడిగేవారు లేరనే అహంకారం పెరిగిపోతుండడంతో దేశంలో సర్వత్రా ఇలాంటి నేరాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఇలాంటి ఘోరాలు చేసే రాక్షసులకు రాజకీయంగా అండదండలుండడమో, లేక వారు ధనగర్వంతో మిడిసిపోతుండడమో, అధికారయంత్రాంగంతో సహా ఎవరినైనా మభ్యపెట్టి తమ రాక్షసక్రీడకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేసుకోవడమో జరుగుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల అసహాయులైన అబలలు, బాలికలు తమ దురవస్థను ఎవరికీ ఏమీ చెప్పుకోలేక, చెప్పుకున్నా చివరికి తమ బతుకే నాశనమైపోతుందేమోననే భయంతో నిత్యం ఆ నరకంలో పడి ఏడుస్తూ బతుకు లీడుస్తున్నారంటే.. ఎంత దయనీయం!... ఒకవైపు దుర్భర దారిద్ర్యం, మరోవైపు తమకంటూ ఎవరూ లేని అనాధస్థితిలో.. చివరికి ఏ గతీ లేక ఏ వసతిగృహాలనో, అనాధాశ్రమాలనో ఆశ్రయించిన అభాగ్యుల పట్ల కూడా ఇలాంటి అకృత్యాలు జరుగుతుండడం దేశ ప్రజలను కంటతడిపెట్టిస్తున్నాయి. కనీస మానవత్వమే లేని అలాంటి మానవ మృగాలను ఇంకా మరెంత కఠినంగా శిక్షించాలో!....కాస్తంత చేయూతనందిస్తే చాలు అన్ని రంగాల్లో ప్రతిభా పాటవాల్తో ముందుకు దూసుకు వెళ్తూ.. ఇటు కుటుంబానికి, అటు దేశానికి ఎంతో మానవీయమైన.. మహోన్నతమైన సేవలందిస్తున్న మహిళాలోకానికి పూజ్యభావంతో ఎంత సేవ చేసినా పుణ్యమే. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలుంటారని ప్రతీతి. అలాంటి ప్రగాఢ విశ్వాసం, దైవచింతన.. మానవీయభావాలకు పుట్టినిల్లయిన మనదేశంలో కూడా మహిళల పట్ల, బాలికల పట్ల లైంగికదాడులు, హింసలు పెరిగిపోతుండడం ఎంతైనా బాధాకరం. ఇకనైనా ఈ అరాచకాలను వెంటనే అరికట్టాలి. కేవలం చట్టాలు చేసేసి చేతులు దులుపుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. చట్టాలెంత పకడ్బందీగా ఉన్నా, వాటిని పటిష్టంగా అమలుచేయలేకపోవడం వల్ల ఎంతోమంది అమాయకులు ఇలా బలైపోతూనే ఉంటారు. ఆ చట్టాలతో దోషులకు కఠినశిక్షలను విధించినప్పుడే.. చేసిన చట్టాలకు సార్థకత. ప్రభుత్వాలు, అధికారయంత్రాంగం కొరడా పట్టుకుంటే తప్ప ఈ రాక్షసమూకల్ని..కామపిశాచుల్ని నియంత్రించడం ఎవరికీ సాధ్యం కాదు. అదేవిధంగా చిన్నతనం నుంచి పిల్లలకు నైతికవిద్య బోధిస్తూ, అన్ని రకాల విషసంస్కృతులకీ వారిని దూరంగా ఉంచుతూ, మంచితనాన్ని-సేవాభావాన్ని వారిలో పెంచుతూ..బాలలను పవిత్రంగా.. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన కర్తవ్యాన్ని కూడా ఎవరూ విస్మరించరాదు.

## 'గీతాంజలి'లో ముగిసిన అధ్యాపక శిక్షణ



నెల్లూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో గతనెల 30 నుంచి నిర్వహిస్తున్న అధ్యాపక శిక్షణాకార్యక్రమం ఈ నెల 4తో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపురోజున ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు మాట్లాడుతూ, 'హడూప్' సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఐసిటి సంస్థ ప్రతినిధి దినేష్‌కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారని, హడూప్ సాంకేతిక పరిజ్ఞానం, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటరింగ్ పరిజ్ఞానంతో అనుసంధానింపబడిందని తెలిపారు. దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ఈ పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకున్నప్పుడు నూతన సాంకేతికతను ఆవిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిఎస్ఇ విభాగాధిపతి డా.జాహ్నవి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం.మదన్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు



నెల్లూరులోని శ్రీ రంగనాధస్వామి దేవాలయంలో జరుగుతున్న ఆండాళ్ తిరువాడిప్పూర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేది రాత్రి ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాధాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ ఇ.ఓ జనార్దనరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు ఉభయకర్తగా సి.నరసింహారావు వ్యవహరించారు.




## నాయకులా? దేశ ద్రోహులా?

ఈ దేశంలో పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించేవారికి ఈ దేశంలో జీవించే హక్కు కల్పించాలి. ఈ దేశం తిండి తింటూ పక్క దేశాలకు జైకొట్టే వాళ్ళను దేశం నుండి తన్ని తరిమెయ్యాలి. దేశద్రోహానికి పాల్పడే రాజకీయ నాయకులకు కూడా ఇదే పద్ధతిని అమలు చేయాలి. అస్సాం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో కోట్ల సంఖ్యలో బంగ్లాదేశీయులు అక్రమంగా చొరబడటం తెలిసిందే! వీరివల్ల స్థానికులకు భద్రత లేకుండా పోవడమే కాక, దేశ ఆర్థిక వ్యవస్థకు వాళ్ళు పెనుభారం కానున్నారు. ఇలాంటి వారిని ఏరివేసే దిశగా ప్రారంభించిన ఎన్ఆర్‌సిని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు మరికొన్ని పార్టీలు వ్యతిరేకించడం దారుణం. వీళ్ళదంతా ఓట్ల బ్యాంకు రాజకీయం. అక్రమ వలసదారులకు వత్తాసుపలికే నాయకులెవరైనా సరే దేశద్రోహులే! ఇలాంటివారికి దేశప్రజలంతా ఒక తాటిపై నిలబడి బుద్ధి చెప్పాలి.

**– జి.నరేష్‌గుప్తా, హైదరాబాద్.**

## పానకంలో పుడక పవన్

రాజనారాయణ లాంటి సామాన్యుడు ఇందిరాగాంధీని ఓడించాడు. శ్రీనివాసన్ అనే విద్యార్థి కామరాజ్‌నాడార్‌ను ఓడించాడు. ఇవి కొన్ని విచిత్ర సంఘటనలు. గ్రామాలలో కూడా కరుడుగట్టిన రాజకీయనాయకులను అమాయకులు ఓడించిన సందర్భాలున్నాయి. మన దురదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో కూడా చికెన్ నారాయణ, పావలా పవన్‌లు వున్నారు. రాష్ట్ర రాజకీయాలలో పవన్ పానకంలో పుడకలా తయారయ్యాడు. చంద్రబాబు, జగన్‌లు ముస్లింల ఓట్ల కొరకు బీజేపీపై వ్యతిరేకత పెంచుతున్నారు. పవన్ తిక్కచేష్టలతో మైకుల ముందు ఊగిపోతున్నాడు. ఎలక్షన్ దగ్గరకు వచ్చాక ఏ పార్టీకి మద్దతు ఇస్తాడో తెలియదు. పవన్ వివేకంతో వ్యవహరించడం నేర్చుకోవాలి. రాజకీయ తీరుతెన్నులు తెలుసుకోవాలి. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## నిరుద్యోగ భృతికి సవరణలు

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగభృతిని ప్రకటిస్తూ కొన్ని మార్గదర్శకాలను సూచించింది. తెల్లకార్డు కలిగి 25 నుండి 35ఏళ్ళ లోపు వారినే దీనికి అర్హులుగా తీసుకుంటున్నారు. డిగ్రీలు తీసుకుని ఉద్యోగాలు రానివాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి వారికి కూడా నిరుద్యోగభృతిని వర్తింపజేయాలి. అలాగే ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నవారిని పరిగణనలోకి తీసుకురానక్కరలేదు.

**ఆర్.ఎస్.నాథ్, నెల్లూరు.**

## రోడ్ల మీద దురాగతాలు

నెల్లూరు నగరంలోని కొన్ని ప్రాంతాలలో రౌడీమూకల వికృత చేష్టలు ఎక్కువవుతున్నాయి. రోడ్లమీదే ఆటలాడుతూ హల్‌చల్ చేస్తున్నారు. యువకులు గ్రూపులుగా విడిపోయి గొడవలకు దిగుతున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ తిష్టవేస్తూ మద్యం తాగుతున్నారు. కొందరు విద్యార్థులు కాలేజీలకు వెళ్ళకుండా సెల్‌ఫోన్‌లలో అసభ్య చిత్రాలు చూస్తూ కాలం గడుపుతున్నారు. రాత్రివేళల్లో బైక్ రేసులు పెట్టుకుంటూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

**బాధితులు, కపాడిపాలెం, నెల్లూరు.**



# ఎవడైతే నాకేంటి

**• ప్రత్యర్థులు ఎంతటివారైనా... బస్తీమే సవాల్ అంటున్న అనిల్**

**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో జగన్ ఆత్మాహుతి దళం అన్నట్లుగా ఓ టీమ్ వుంది. ఈ టీమ్ సభ్యులు గెలిచినా, ఓడినా చివరకు చచ్చినా జగనన్నతోనే మా ప్రయాణం అన్నట్లుంటారు. అలాంటి టీమ్‌లో ఒక సభ్యుడే నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్. 2014 ఎన్నికల్లో నెల్లూరు నగర అసెంబ్లీ నుండి భారీమెజార్టీతో గెలిచిన అనిల్, ఈ నాలుగేళ్ళ కాలంలో జగన్‌కు వీరవిధేయుడయ్యాడు. ప్రభుత్వంపైకి విమర్శలతో ఉరకడంలో జగన్ చేతిలో అస్త్రమయ్యాడు. జగన్‌కు అత్యంత నమ్మకస్తుడిగా వుంటూ తన నియోజకవర్గంలోనే కాదు, రాష్ట్రంలోనే వైసిపి కార్యకర్తలు, అభిమానులకు మరింత చేరువయ్యాడు.**

ఈ నాలుగేళ్ళలో అటు అసెంబ్లీలోనూ, ఇటు ప్రజలలోనూ అనిల్ దూకుడును అందరూ చూస్తున్నారు. ఓపక్క పార్టీపరమైన కార్యక్రమాలలో చురుకుగా వుంటూనే, మరోపక్క తన నియోజకవర్గ ప్రజలకు కూడా దగ్గరగా వుంటున్నాడు అనిల్. తన నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై స్పందిస్తుండడం, వారి కోసం పోరాటాలు చేయడం చూస్తున్నాం.

తెలుగుదేశం నాయకులకు జిల్లాలో కొన్ని నియోజకవర్గాలలో సమర్థులైన అభ్యర్థుల సమస్య వుంది. ఆత్మకూరు, నెల్లూరురూరల్, సూళ్ళూరుపేట నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోనూ గట్టి అభ్యర్థిని వెదకడం, అది కూడా అనిల్‌ను ఢీకొట్టే అభ్యర్థిని ఎంపిక చేయడం వారికి సమస్యగా వుంది. నగరం టిక్కెట్ రేసులో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధలు వున్నప్పటికీ ఇప్పుడున్న పరిస్థితుల్లో అనిల్‌కు వాళ్లైతే గట్టిపోటీ ఇవ్వలేరని పార్టీ వర్గాలలోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే నెల్లూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా మంత్రి నారాయణ పేరు చాలా రోజులుగా ప్రచారంలో వుంది. నారాయణకు ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయాలనే ఆసక్తి లేదు. అది కూడా నెల్లూరుజిల్లా నుండి పోటీ చేయాలనుకోవడం లేదు. కాని, చంద్రబాబు నువ్వు దిగాల్సిందేనని ఆదేశిస్తే మాత్రం నారాయణకు పోటీ చేయక తప్పదు.

నెల్లూరు నగరం నుండి నారాయణకే కాదు, నారా లోకేష్, నారా చంద్రబాబునాయుడులు పోటీ చేసినా వెనక్కుతగ్గేది లేదని, బస్తీమే సవాల్ అంటున్నాడు అనిల్! వచ్చే ఎన్నికల్లో తన ప్రత్యర్థి మంత్రి నారాయణే అన్న భావంతోనే అనిల్ రాజకీయంగా అడుగులు వేస్తున్నాడు. నారాయణను అన్నివిధాలా ఢీకొట్టడానికి శక్తియుక్తులు కూడగడుతున్నాడు.

నగరంలో నారాయణకు అనుకూల అంశం సొంత కులమైన కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువుగా వుండడం. ఇక నారాయణ ఆర్థిక బలం ముందు అనిల్ నిలబడలేడు. నారాయణ ఎందుకైనా మంచిదనే ముందుచూపుతో ఇటీవల నగర రాజకీయాలపై ఎక్కువ దృష్టి పెడుతున్నాడు. పార్కులు, డ్రైన్లు, కాలువల పూడికతీత, ఇళ్ళ నిర్మాణం వంటి కార్యక్రమాలు విరివిగా చేయిస్తున్నాడు. ఆర్థికంగా నారాయణను ఎదుర్కోవడం అనిల్‌కు కష్టమే! కానీ రాజకీయంగా మోటుకోగల తెలివితేటలు, వాగ్ధాటి అనిల్‌కున్నాయి. నారాయణ విద్యాసంస్థలపై అనిల్ తొలి నుండి దాడి చేస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక, నారాయణ మంత్రి అయ్యాక ఆయనపై మొదటి విమర్శల తూటా పేల్చింది అనీలే! అవకాశం చిక్కినప్పుడల్లా నారాయణ విద్యాసంస్థల మీద, అక్కడి ఫీజుల మీద, ఆ సంస్థలలో జరిగే విద్యార్థుల ఆత్మహత్యల మీద అనిల్ తరచూ విరుచుకుపడుతున్నాడు. ఇక నెల్లూరులో మంత్రి పర్యవేక్షణలో జరుగుతున్న 'హౌస్ ఫర్ ఆల్' ఇళ్ళ నిర్మాణంలో అక్రమాలపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నది కూడా అనీలే!

తాజాగా మరోసారి అనిల్ 'నారాయణ' మీదకు ఆరోపణాస్త్రాలు సంధించాడు. నారాయణ విద్యాసంస్థల్లో వసూలు చేసే ఫీజలుపై పోరాటం మొదలుపెట్టాడు. నారాయణ విద్యాసంస్థలు ఫీజుల దాహంతో జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయనే దిశగా ప్రజలపై బలమైన ముద్ర వేసి, నారాయణపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేలా అనిల్ పావులు కదుపుతున్నాడు.

నెల్లూరు నగరంలో టీడీపీ అభ్యర్థిగా నారాయణ పోటీలోకి దిగితే ఇది అనిల్‌కు కాదు, నారాయణకే సవాల్‌గా మారుతుంది. అనిల్‌కు గెలుపోటములు సమస్య కాదు. ఒకసారి ఓడాడు, మరోసారి గెలిచాడు. రేపు నారాయణ చేతిలో అతను ఓడిపోయినా అతనికి పోయేదేమీ లేదు. పార్టీ గెలిచి, తాను ఓడిపోతే పెద్ద లెక్కలోకి కూడా తీసుకోడు. వైసిపి అధికారంలోకి వస్తే పార్టీలో అనిల్ ప్రాధాన్యత అలాగే వుంటుంది. కాని, ఇక్కడ నారాయణకే సమస్య! గెలిస్తే ఫర్వాలేదు, ఓడిపోతే మాత్రం నారాయణ పరిస్థితి గాలి తీసిన ట్యూబ్‌లా అవుతుంది.

# బీజేపీ నేతలతో ఏపికి నష్టం

## - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కలిగించేలా బీజేపీ నాయకుల మాటలు, చేష్టలు వుంటున్నా యని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించాడు. 7వ తేదీ నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి నష్టం కలిగించేలా బీజేపీ ఎంపీ నరసింహారావు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టాడు. పి.డి అకౌంట్లపై నరసింహారావుకు కనీస అవగాహన లేదు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా పి.డి అకౌంట్లలో నిధులు డ్రా చేయడానికి అవకాశం వుండదు. పి.డి అకౌంట్ అంటే పర్సనల్ అకౌంట్ అని నరసింహారావు అనుకుంటున్నట్లుంది. ఈయనకు కన్నా లక్ష్మీనారాయణ కూడా తోడై తలాతోక లేకుండా మాట్లాడుతున్నారు. పి.డి అకౌంట్లపై అవగాహన తెచ్చుకోవాలంటే నరసింహారావు నెల్లూరుకు రావచ్చు. జిల్లాలో 3400 పి.డి అకౌంట్లున్నాయి. నరసింహారావు నెల్లూరులో ఏ అకౌంట్‌నైనా పరిశీలించుకోవచ్చు. పి.డి అకౌంట్స్‌లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని ఆయన చెప్పాడు. నిజాలు తెలుసుకుని నరసింహారావు తన పొరపాటును సరిదిద్దుకోవాలని ఆయన సూచించాడు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం కంటే అభివృద్ధి కోసం చేస్తున్న ఖర్చు ఎక్కువని, రాష్ట్రానికి కేంద్రం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో ఖజానా శాఖ డి.డి ఉదయలక్ష్మి కూడా పాల్గొన్నారు.

## పోలీసు శాఖకు సవాల్‌గా మారిన...

# రాపూరు సంఘటన

**రాపూరు పోలీసుస్టేషన్‌పై దాదాపు 50మంది స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వారు దాడి చేయడం, ఎస్.ఐ లక్ష్మణరావుతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్ళను కొట్టడం రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టకే సవాల్‌గా మారింది. సాధారణంగా ఇలాంటి సన్నివేశాలను మన తెలుగు సినిమాలలోనే చూస్తుంటాం. నిజ జీవితంలో కూడా చూడాల్సి రావడం విచారకరం.**



దాడిలో గాయపడిన ఎస్.ఐను పరామర్శిస్తున్న ఐ.జి గోపాలరావు, ఎస్పీ రామకృష్ణ

రాపూరు సంఘటనతో పోలీసు ఉన్నతాధికారులే ఉలిక్కిపడ్డారు. గుంటూరు రేంజ్ ఐ.జి గోపాలరావు హుటాహుటిన పరుగెత్తుకుంటూ వచ్చారు. దాడిలో పాల్గొన్న దళితుల తరపున రాష్ట్ర స్థాయి దళిత సంఘాల నాయకులు కూడా రంగంలోకి దిగారు. దాడిలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్ట్ చేసారు.

దాదాపు 50మంది పోలీసుస్టేషన్‌పై దాడి చేసేంత తీవ్రస్థాయి సంఘటనకు పునాది కేవలం 2వేల రూపాయలేనని తెలిసింది. ఇది తెలిసాక చాలామంది ఆశ్చర్యపోతున్నారు. తనకు రావాల్సిన రెండువేల రూపాయల బాకీ నిమిత్తం జోసెఫ్ అనే ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ లక్ష్మణరావు కాలనీకి చెందిన పిచ్చయ్య, లక్ష్మమ్మ, కనకమ్మ అనే వారిని స్టేషన్‌కు పిలిపించాడు. వారిపై చేయి చేసుకున్నాడని తెలిసింది. వీరిలో ఒక మహిళ కిందపడిపోవడంతో ఆమె చనిపోయిందనుకున్న కాలనీ వాసులు ఆగ్రహంతో పోలీసుస్టేషన్‌పై పడ్డారు. ఎస్.ఐను, పోలీసులను తీవ్రంగా కొట్టారు.

పోలీసుస్టేషన్ దాడిలో మరో కోణం కూడా వినిపిస్తోంది. ఎస్.ఐ లక్ష్మణరావు ఇక్కడ చాలామందికి కొరుకుడు పడని కొయ్యగా మారాడు. కొంతమందికి ఆయన దురుసు వ్యవహారశైలి నచ్చడం లేదు. ఓ అధికారపార్టీ నాయకుడి అండ చూసుకునే కొందరు ఎస్.ఐపై దాడికి పాల్పడ్డారని సమాచారం. ఏదేమైనా ఇది ప్రభుత్వానికి, పోలీసు శాఖకు చాలా సున్నిత సమస్య. పోలీసులపై దాడికి పాల్పడ్డవారిని అరెస్ట్ చేసి కోర్టు బోను ఎక్కించకతప్పదు. లేకుంటే మీ మీద దాడి జరిగితేనే ఏమీ చేయలేనోళ్ళు, ఇక ప్రజల మీద దాడి జరిగితే మీరేం చేయగలరనే ప్రశ్న వస్తుంది.

అదే సమయంలో దాడికి పాల్పడింది దళితులు కాబట్టి వారిపై కఠిన వైఖరి అవలంభిస్తే పాలకపక్షానికి లేనిపోని సమస్యలు. ఇక వచ్చేది ఎలక్షన్ సీజన్. కులాల పరంగా ఓట్ల వేట మొదలవుతుంది. ఈ సంఘటనపై పోలీసులు మరీ కఠినంగా వ్యవహరిస్తే తమకు దళితుల నుండి వ్యతిరేకత వస్తుందనే ఆందోళన అధికార తెలుగుదేశంలో వుంది. మొత్తానికి రాపూరు సంఘటన అటు పోలీసు ప్రతిష్టకు, ఇటు అధికార పార్టీ ఓట్ల రాజకీయానికి సవాల్‌గా మారింది.

# బిజిఆర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు



నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీకంఠనాథ్‌రెడ్డి ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ-కరెస్పాండెంట్ జె.వి రెడ్డి మాట్లాడుతూ, నూతన విద్యార్థినులను అభినందించారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సన్నపురెడ్డి రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ మృదుల, సీనియర్ అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డితో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# చందుతో వేడుకగా స్నేహితుల దినోత్సవం


ఫ్రెండ్‌షిప్‌డే కేక్‌ను కట్‌చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న పలువురు యువకులు, స్నేహితులు అందరూ కలిసి సేవాభావంతో సమాజానికి సేవలందిస్తున్న నెల్లూరులోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) నివాసానికి వచ్చి ఆయనతో కేక్ కట్‌చేయించి స్నేహితుల దినోత్సవాన్ని సంబరంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మాగుంట శరత్ మాట్లాడుతూ, స్నేహితుల దినోత్సవాన్ని మీ అందరి సమక్షంలో ఇలా ఘనంగా జరుపుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. నగరంలోని యువత సహకారం వల్లనే తానింత స్థాయికి వచ్చానని ఆయన ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మన ఊరి సంక్షేమాన్ని మన బాధ్యతగా చూసుకోవాలని, మనమంతా నగరాభ్యున్నతికి కృషి చేయాలని ఆయన తన స్నేహితులందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజయ్‌బాబు, కె.లేఖిన్ రెడ్డి, హరికిషన్‌రెడ్డి, సిహెచ్ మహేష్, కె.అశోక్, సాయిబాబా, సాయికృష్ణ, నూనె రిషియాదవ్, బాబు పాల్గొన్నారు.

# నగర కాలువల్లోనే వ్యర్థాలు


ఇళ్ళల్లో నుండి నేరుగా కాలువలోకి డ్రైనేజి పైప్‌లైన్‌లు వదిలిన దృశ్యం

నెల్లూరులో పెన్నా ఆనకట్ట వద్ద నుండి సర్వేపల్లి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువలు నగరంలో నుండి వెళుతుంటాయి. ఇవి పెన్నా నీళ్ళను తీసుకెళ్ళే సాగునీటి కాలువలు. కాని వాటి రూపం చూస్తే అలా వుండదు. మురికి కాలువలు మాదిరిగా వుంటాయి. నగరం పరిధిలో ఈ రెండు కాలువకట్టలు ఆక్రమణలకు గురై, పెద్దపెద్ద కాలనీలే ఏర్పడ్డాయి. వీటి మీద నివాసులు ఏర్పరచుకున్నవాళ్ళు తమ బాత్రూం కనెక్షన్‌లను నేరుగా కాలువలలోకే వదిలివుంటారు. మలమూత్రాలు నిండి ఈ కాలువల పరిసరాలు కంపుకొడుతుంటాయి. ఈ కాలువల గట్ల మీద గట్టిగా నిముషం నిలవలేని పరిస్థితి. కాలువ కట్టల మీద వున్నోళ్ళే గబ్బు చేస్తున్నారనుకుంటే ఇప్పుడు సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేసేవాళ్ళు కూడా తయారయ్యారు. నగరంలోని ఇళ్ళు, అపార్ట్‌మెంట్లలో సెప్టిక్ ట్యాంకులు నిండినప్పుడు సెప్టిక్ ట్యాంకర్లు వచ్చి క్లీన్ చేస్తాయి. అక్కడ లోడ్ చేసిన మలమూత్రాలను నగర పరిధిలోనే ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో సర్వేపల్లి కాలువలోకి వదులుతున్నారు. అసలే నగరం కంపుకొడుతుంటే... ఇలాంటి వాటితో మరింత గబ్బుకొట్టే అవకాశముంది.

# బీజేపీ బీసీ నేతల సంబరం



జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో నెల్లూరులో బీజేపీ బీసీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ట్రంకురోడ్డులోని లస్సీ సెంటర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బి.బాలాజీ, రామనాధం, ఓజిలి సుధాకర్, బండారు సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపయోగం లేని వంతెనలు



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద సర్వేపల్లి కాలువపై పాతవంతెనలు సరిపోకపోవడంతో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు కొత్త వంతెనలు కట్టారు. అయితే వంతెనలకు తగిన విధంగా స్టోన్‌హౌస్‌పేట రోడ్డును వెడల్పు చేయకపోవడంతో ఈ వంతెనలను కట్టి కూడా ఉపయోగం లేకుండా పోయింది. కొత్తగా కట్టిన వంతెనలు ఆటోస్టాండ్‌గాను, పూలు, పండ్ల బండ్లు పెట్టుకునే వ్యాపారులకు ఉపయోగపడుతున్నాయి.

## 12న 'యాదే రఫీ'
## సిల్వర్‌జూబ్లీ మ్యూజికల్‌నైట్

మధురగాయకుడు, పద్మశ్రీ మహ్మద్ రఫీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 12న 'యాదే రఫీ-2018 సిల్వర్‌జూబ్లీ మ్యూజికల్‌నైట్' నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 5న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నిర్వాహకులతో కలిసి మేయర్ అబ్దుల్‌అజీజ్, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. నెల్లూరు మినీబైపాస్‌లోని అనిల్‌గార్డెన్స్‌లో ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి మ్యూజికల్‌నైట్ ప్రారంభమవుతుందని, జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ సంగీతవిభావరి జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత పాస్‌లను కార్పొరేటర్లు ఆనం రంగమయూర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, సుడా డైరెక్టర్ ఖాజావలి విడుదల చేశారు. ఉచిత పాస్‌లకు 9246429786 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## సెపక్ తక్రా క్రీడా సంఘం
## ఉపాధ్యక్షుడిగా సుకుమార్



ఆంధ్రప్రదేశ్ సెపక్ తక్రా క్రీడా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరుజిల్లాకు చెందిన పి.ఇ.టి ఏ.సుకుమార్ ఎన్నికయ్యారు. 5వ తేదీ కర్నూలులో జరిగిన క్రీడా సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయనను ఈ పదవికి ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఆయన జిల్లా సెపక్‌తక్రా సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

## బీజేపీ రాష్ట్ర కమిటీలో
## ఇంకో ముగ్గురు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుండి మరో ముగ్గురికి చోటు దక్కింది. గతంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా వున్న కె.కోటేశ్వరరావును ఇప్పుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. అలాగే మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ ఆర్.డి.విల్సన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఇక నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు గాని ఆయన పార్టీలో కొనసాగే అవకాశాలు లేవు.

# నెల్లూరు కబుర్లు

## సీఎం 24న రావచ్చు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 24న జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయి. ఆరోజు వెంకటేశ్వరపురం వద్ద నిర్మించిన 'హౌస్ ఫర్ ఆల్' గృహ సముదాయాలను ఆయన ప్రారంభిస్తారు. అలాగే దగదర్తి ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపనతో పాటు జిల్లా పోలీసు కార్యాలయం, నూతన పోలీస్‌స్టేషన్ భవనాలను ఆయన ప్రారంభిస్తారు. సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సివుంది.

## బాబొచ్చె... జాబు పోయె


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రూప్‌కుమార్‌యాదవ్

ఎన్నికల్లో జాబు కావాలంటే బాబు రావాలని తెలుగుదేశం ప్రచారం చేసిందని, చంద్రబాబు సీఎం అయ్యాక ఉన్న జాబులు ఊడసాగాయని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ విమర్శించాడు. తెలుగుదేశం ప్రభుత్వ నిరుద్యోగ వంచనకు నిరసనగా 7వ తేదీ జిల్లా కలెక్టరేట్ ఎదుట వైసిపి యువజన విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక 80వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారన్నారు. గడచిన నాలుగేళ్ళుగా 2.50లక్షల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని, ఇప్పటివరకు వాటిని భర్తీ చేయకుండా ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు కొత్త నాటకాలకు తెరలేపుతున్నాడని ఆరోపించాడు. రాష్ట్రంలో కోటి 80లక్షల మంది నిరుద్యోగులుంటే కేవలం 12లక్షల మందికి మాత్రమే షరతులపై నిరుద్యోగ భృతి అది కూడా నెలకు వెయ్యిరూపాయలు ఇస్తానని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ నగర అధ్యక్షుడు గంధం సుధీర్‌బాబు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జి.పి.శ్రావణ్‌కుమార్, మేఘునాథ్‌సింగ్, షేక్ హాజీ, హరికృష్ణయాదవ్, జయవర్ధన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవు పిడకలు కావాలా!...
## సెంట్రల్‌జైలును సంప్రదించండి!


నెల్లూరు సెంట్రల్ జైల్లో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్ట్ యార్డ్


నెల్లూరు, చెముడుగుంటలోని జిల్లా కేంద్ర కారాగారంలో వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసి ఇందులో ఖైదీల ద్వారా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయిస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ... వాటిని మార్కెట్‌లో అమ్ముతున్నారు. అలాగే ఈ వ్యవసాయ క్షేత్రంలో హోమాలు, యాగాలకు అవసరమయ్యే ఆవు పిడకలను, సేంద్రీయ వ్యవసాయం కోసం వర్మీకంపోస్ట్‌లను, గోమూత్రంతో జీవామృతంను తయారు చేయిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ రవికిరణ్ తెలిపారు. సుధార్ బ్రాండ్ పేరుతో త్వరలోనే వీటిని మార్కెట్‌లోకి విడుదల చేస్తామని, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ద్వారా కూడా అమ్మకాలు జరుపుతామని, వీటిని కొనుగోలు చేసేందుకు 9494633862, 9182277371 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## రూరల్ పోలీసుల వనం - మనం



నెల్లూరు రూరల్ సి.ఐ బి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 6వ తేదీ నగర శివార్లలోని దొరతోపు సంగం వద్ద 'వనం-మనం' కార్యక్రమం జరిగింది. స్థానికులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సి.ఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటే ప్రక్రియను ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. చెట్లను మనం బ్రతికిస్తే, అవి సమాజాన్నే బ్రతికిస్తాయని, చెట్లను పెంచడం ప్రతివ్యక్తి జీవితంలోనూ ఒక బాధ్యత కావాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# 'దేశం' తోనే.. యువతకు భవిత!



## • భారీ ర్యాలీతో సత్తా చాటిన సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కల్పిస్తూ 'ముఖ్యమంత్రి – యువనేస్తం' పథకం ప్రకటించడం తెలిసిందే! అయితే దీనిపై ప్రభుత్వానికి అనుకున్నంతగా మైలేజీ రాలేదు. విపక్షాలు దీనిపై పెద్దఎత్తునే విమర్శలు చేసాయి. 'ముఖ్యమంత్రి – యువనేస్తం' పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో తెలుగుదేశం శ్రేణులే నిర్లక్ష్యంగా ఉన్నాయి. ఈ దశలో 'ముఖ్యమంత్రి –యువనేస్తం' పథకం ద్వారా నిరుద్యోగులను ఆదుకున్నందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఐ.టి మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ 7వ తేదీ ఉదయం సర్వేపల్లి నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు ఏ.సి. స్టేడియం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిర్వహించిన మోటార్‌బైక్‌ల ర్యాలీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కేడర్‌లోనే కదలిక తెచ్చింది. వేలాది వాహనాలతో యువకులు ఎంతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనగా, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వయంగా బైక్ నడుపుతూ కార్యకర్తల ఉత్సాహానికి మరింత ఊపు తెచ్చారు. దారి పొడవునా చంద్రబాబుకు జిందాబాద్‌లు కొడుతూ నినాదాలతో హోరెత్తించారు. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

అనంతరం యువకులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ యువతకు తెలుగుదేశంతోనే భవిష్యత్ అని చెప్పారు. ప్రపంచం మెచ్చిన నాయకుడు చంద్రబాబునాయుడని, రాష్ట్రానికి అలాంటి నాయకుడు సీఎం కావడం ప్రజల అదృష్టమన్నారు. యువత తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని చంద్రబాబు 'ముఖ్యమంత్రి– యువనేస్తం' ద్వారా నిజం చేసారని చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలన్నీ ఏపిలో పెట్టుబడులు పెట్టడానికి పోటీపడి పరుగులు తీస్తున్నాయన్నారు. గత నాలుగేళ్ళలో ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లలో 6లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించి రికార్డు సృష్టించడం జరిగిందన్నారు. ఐ.టి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే లోకేష్ ఒక్క ఐ.టి రంగంలోనే 70వేలకు పైగా ఉద్యోగాలు సృష్టించాడన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు యువత, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు సర్వేపల్లి, నెల్లూరు, కోవూరు నియోజకవర్గాల నుండి పెద్దసంఖ్యలో యువకులు తరలివచ్చారు.

# ముస్లిం సోదరా... ఛలో గుంటూరు!



'నారా హమారా - టిడిపి హమారా' వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న బీద రవిచంద్ర, మేయర్ అజీజ్

ముస్లింల సంక్షేమం, వారి సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీన గుంటూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన 'నారా హమారా – టీడీపీ హమారా' మహాసభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పిలుపునిచ్చాడు. ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధికి పాటుపడేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే దిశగా గుంటూరు సభ జరుగుతుందని, ముస్లింలు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ముస్లింల విద్య, ఉపాధి కోసం తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేకంగా 1100కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, విదేశీ విద్యా, ఇమాం, మౌజన్‌కు గౌరవ వేతనాలు, మసీదుల అభివృద్ధి, షాదీమంజిళ్ళ నిర్మాణాలు వంటి పథకాలెన్నో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 28వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగే ముస్లింల మహాసభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా రానున్నారని, ఈ సభకు జిల్లా నలుమూలల నుండి ముస్లిం సోదరులు తరలి రావాలని ఆయన కోరారు.

# డిఎఫ్ఓగా వేణుగోపాలరావు

జిల్లా అటవీశాఖాధికారిగా సి.వేణుగోపాలరావును నియమించారు. విజయనగరం అటవీశాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను నెల్లూరుకు బదిలీ చేసి ఇక్కడ వున్న రామ్మోహన్‌రావును రాష్ట్ర అటవీశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. ఇటీవలే రామ్మోహన్‌రావుకు చీఫ్ కన్జర్వేటర్‌గా పదోన్నతి లభించింది.

# పరసాతో పని లేదు

## • వ్యతిరేకిస్తున్న వేనాటి వర్గం



*జిల్లాలోని రెండు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలలో సూళ్ళూరుపేట ఒకటి. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు, గెలిచే ఎమ్మెల్యేలు దళితులైనప్పటికీ, నడిపించేది మాత్రం అగ్రవర్ణాల నాయకులే! ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా పరోక్ష పెత్తనం మాత్రం వారిదే!*

1994 నుండి 2014వరకు పరసారత్నం సూళ్ళూరుపేట నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ పర్మినెంట్ అభ్యర్థిగా ఉంటున్నాడు. ఈ నియోజకవర్గం నుండి వరుసగా ఐదుసార్లు పోటీ చేసాడు. మూడుదఫాలు గెలిచాడు. 2004, మొన్న జరిగిన 2014 ఎన్నికల్లో ఓడిపోయాడు. 1983 నుండి కూడా ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించుకోవడంలో వేనాటి సోదరులు కీలకపాత్ర పోషిస్తూ వచ్చారు. 1994లో సూళ్ళూరుపేట అభ్యర్థిగా వచ్చిన పరసా రత్నం వేనాటి కుటుంబంతో సఖ్యతగానే వుంటూ వచ్చాడు.

ఒకప్పుడు సూళ్ళూరుపేట తెలుగుదేశం అంటే వేనాటి కుటుంబందే పెద్ద నాయకత్వం. కాని, ఇప్పుడు పార్టీలో బహునాయకత్వం తయారైంది. ఆధిపత్య రాజకీయాలు నడుస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఎవరు ఎవరిని అభ్యర్థిగా తెరమీదకు తెస్తారో చెప్పలేని పరిస్థితి. అయితే వరుసగా ఐదుసార్లు పోటీ చేసిన పరసారత్నంను మాత్రం ఈసారి వేనాటి వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ప్రజల్లో పరసాపై గతంలో వున్నంత ఆదరణ లేదు. వైసిపి ఎమ్మెల్యే సంజీవయ్యకు ప్రజల్లో మంచి పేరుంది. పరసా రత్నం ఆయనకు గట్టి పోటీనివ్వలేడనే అభిప్రాయం వుంది. దీనివల్లే ఈసారి పోటీకి పరసా పనికిరాడంటున్నారు. ఇక పరసా బదులు సంజీవయ్యకు ధీటైన అభ్యర్థి దొరకడం పార్టీ నాయకత్వానికి పెద్ద సమస్యే కానుంది.




# శాకాంబరి అలంకారంలో చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరిదేవి ఆలయం ఈ నెల 5న భక్తులతో క్రిక్కిరిసి పోయింది. ఆలయ అర్చకులు అమ్మవారిని శాకాంబరి అలంకారంలో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నెల్లూరుకు చెందిన కొలపర్తి రమేష్‌కుమార్- సువర్ణలక్ష్మి, వారి కుమారుడు లిఖిత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అమ్మవారిని పండ్లు, కూరగాయలతో అలంకరించడంతో అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. 5వ అదనపు జిల్లా జడ్జి చంద్రశేఖర్‌రావు దంపతులు, దేవాదాయశాఖ సహాయకమిషనర్ రవీంద్రరెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డి, ఇందుకూరుపేట, టిపి గూడూరు ఎస్‌ఐలు బలరామిరెడ్డి, శివకృష్ణారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ రామచంద్రనాయుడు, ధర్మకర్తలు పేరిసెట్ల శివకుమార్, దుర్గాప్రసాద్‌రావు, మెట్టా శ్రీనివాసులురెడ్డి, రామాని ప్రసాద్, గున్నం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జయజయధ్వానాలతో సాయినాధుని నగరోత్సవం

## - భజనలు, కోలాటాలతో సందడే సందడి




భజనలు, కోలాటాలతో, విచిత్ర వేష ధారణలు, బ్యాండుమేళాలు, తప్పెట్లు తాళాల మోతలతో, జయజయధ్వానాలతో సాయినాధుని నగరోత్సవం ఎంతో కోలాహలంగా జరిగింది. ఈనెల 4న జరిగిన ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని గరుడవాహనంపై కొలువైవున్న శ్రీ సాయినాధుని దర్శించుకున్నారు. నెల్లూరు ట్రంకురోడ్డులోని శ్రీ షిర్డీసాయి బాబా మందిరంలో జరిగిన గురుపూర్ణిమ ఉత్సవాల్లో ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. విద్యుద్దీపకాంతులతో ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. మంగళవాయిద్యాలతో స్వామివారికి నగరవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మందిరం కమిటీ ఛైర్మెన్ మన్నెం అమర్‌నాధరెడ్డి బాబాకు హారతులిచ్చి నగరోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం సాయిబాబా మందిరం నుంచి గాంధీబొమ్మ, ఏసీ సెంటర్, సంతపేట, చిన్నబజారు, పెద్దబజారు, బార్కాసు, విఆర్‌సి సెంటర్‌ల మీదుగా స్వామివారి ఊరేగింపును ఎంతో వైభవంగా నిర్వహించారు. దారిపొడవునా ప్రజలు, భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు, నైవేద్యాలు సమర్పించుకున్నారు. మందిరం కమిటీ సభ్యులు పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యాం సుందర్‌రెడ్డి, దువ్వూరి జయమ్మ, బి.మోహనరావు పర్యవేక్షించారు.

### వేడుకల ముగింపు సందర్భంగా అన్నదానం :

గురుపూర్ణిమ మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో ఈ నెల 5న భక్తులకు అన్నదానం నిర్వహించారు. భారీగా జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయిబాబా మందిరం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# వృద్ధులకు బులియన్‌మర్చంట్స్ పింఛన్లు



నెల్లూరు రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణమండపంలో ఈనెల 5న ఆర్యవైశ్య వృద్ధులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది వృద్ధులకు రూ.500 వంతున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, సామాజికసేవా కార్యక్రమాల్లో బంగారువ్యాపారులు పాల్గొని సేవలు చేస్తుండడం ఎంతైనా అభినందనీయమన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు అందజేస్తుండడం వల్ల వృద్ధులకు చేయూత లభిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా రాజా మస్తానయ్య-రాజేశ్వరి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు వస్త్రాలు, మధ్యాహ్నం భోజనం అందజేశారు. అదేవిధంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపీకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని వృద్ధులకు గొడుగులు పంపిణీ చేయగా, పచ్చిపులుసు వెంకటకృష్ణ-లక్ష్మి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

# సేవ చేసే మనసుండడం గొప్ప వరం


దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సి.రోహిణి, క్లబ్ ప్రతినిధులు

ఆపదలో వున్న ప్రజలను ఆదుకోవాలన్న మనసు రావడం గొప్ప విషయమని ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలో వీరభద్ర స్వామి దేవాలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో ఈ నెల 5వ తేదీ దివ్యాంగులకు ఫలసరుకులను పంపిణీ చేశారు. గాదంశెట్టి గిరి దాతృత్వంతో దుస్తులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సలహాలు, సూచనలతో ప్రతినెలా దివ్యాంగులకు సరుకులు ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సాయమైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. రెడ్ సంస్థ ప్రతినిధులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ ప్రతినిధులు రాజేష్, సుధీర్, క్లబ్ ప్రతినిధులు స్నేహలతారెడ్డి, జీవని, లక్ష్మి, దాతలు మాధురి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నక్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ


అన్నక్యాంటిన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన, ఎమ్మెల్యే సునీల్‌కుమార్

పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం రూ.5కే అందించాలన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనతో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు.

గూడూరు ఎంపిడివో కార్యాలయ ప్రాంగణంలో గూడూరు పాలక సంఘం ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనతో కలిసి సోమవారం 'అన్న క్యాంటీన్' నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ దేవసేనలు మాట్లాడుతూ పేదప్రజలకు అతితక్కువ ధరకు భోజనం అందించాలన్న ఏకైక లక్ష్యంతోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ క్రమంలోనే గూడూరులో కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ ఓబులేసు, ఎంపిడివో అన్నపూర్ణారావు, నాయకులు వెంకటేశ్వర్లురాజు, భారతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# గంగమ్మ ఆలయ నూతన కమిటీ


నూతన అధ్యక్షుడు ఎల్.వి.రమణబాబును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

యాదవుల కుల దైవం గంగమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేసి, అందరి సహకారం తీసుకొని ముందుకు వెళ్తానని గంగమ్మ దేవాలయం అధ్యక్షుడు, మైథిలి హాస్పిటల్ ఎం.డి ఎల్.వి.రమణబాబు తెలిపారు. గూడూరు పట్టణం రాజావీధిలోని శ్రీ గంగమ్మ ఆలయం నూతన కమిటీని సభ్యులు ఈ నెల 5వ తేదీ ఎన్నుకున్నారు. గంగమ్మ ఆలయం నూతన అధ్యక్షుడిగా ఎల్.వి. రమణబాబు, ఉపాధ్యక్షుడిగా సురేంద్రబాబు, కమిటీ సభ్యులుగా పులిమి శ్రీనివాసులు, సుధాకర్, హనుమంతరావు, శివకుమార్, పుల్లయ్యలను ఎన్నుకున్నారు.

# సాయిబాబా మందిరంలో ఉచిత వైద్యశిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి

గూడూరు పట్టణంలోని షిరిడిసాయి నగర్‌లో వున్న సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా కలిసి ఉచిత వైద్యశిబిరాన్ని ఈ నెల 5వ తేదీ నిర్వహించారు. ప్రతి నెలా నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు చక్కగా సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రముఖ డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వై.స్నేహలతారెడ్డి, జీవని, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పదవిపై రాహుల్ ఫార్ములా!

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్.... సోనియా గాంధీ ఆహ్వానం మేరకు మమతా బెనర్జీ, ములాయంసింగ్ యాదవ్, మాయావతి, శరద్‌పవార్, చంద్రబాబునాయుడులు అక్కడకు వచ్చారు. కాంగ్రెస్ నాయకులు అహ్మద్‌పటేల్, మల్లిఖార్జునఖర్గే, అంబికా సోని, గులాంనబీ ఆజాద్, పనబాక లక్ష్మీలు కూడా అక్కడే వుండి వారిని ఆహ్వానించి ఒక హాల్‌లో కూర్చోబెట్టారు. అంతలో కాషాయపంచె ధరించి భుజాలపై కాషాయ పీతాంబరం వేసుకుని మెడలో పెద్ద రుద్రాక్షమాల, నుదుటన, భుజాల మీద పెద్దపెద్ద విభూది నామాలు పెట్టుకున్న ఓ వ్యక్తి అక్కడకు వచ్చాడు. అతనిని చూడగానే చంద్రబాబు లేచి... హాయ్ సుబ్బరామిరెడ్డి గారు, బాగున్నారా అని అడిగాడు. ఆ మాటకు పనబాక లక్ష్మి ఆశ్చర్యపోయి... సుబ్బరామిరెడ్డి ఎవరు అని అడిగింది. చంద్రబాబు వెంటనే ఈయన మా తిక్కవరపు సుబ్బరామిరెడ్డే కదా, అపర శివభక్తుడు, ఆంధ్ర భక్తకన్నప్ప అని అన్నాడు. అప్పుడు సోనియా కలుగజేసుకుని పకపక నవ్వుతూ... చంద్రబాబూజీ... మీరు పప్పులో కాలేసారు, అతను మీ సుబ్బరామిరెడ్డి కాదు, నా గారాల బిడ్డ రాహుల్ అని చెప్పింది. చంద్రబాబు ఆశ్చర్యపోయి... మరి ఆ వేషధారణేంటి మా సుబ్బరామన్నలాగా అని అడిగాడు. అందుకు సోనియా... కాంగ్రెస్‌పార్టీ హిందూ వ్యతిరేకి అని బీజేపీ వాళ్ళు పదేపదే ముద్రవేస్తున్నారు. దానిని పోగొట్టుకోవడానికే రాహుల్ దేశంలో రోజుకొక శివాలయం సందర్శించాలని కంకణం కట్టుకున్నాడని చెప్పింది. శరద్‌పవార్ వుండి... ఇంతకీ మమ్మల్ని ఎందుకు పిలిపించినట్లని అడిగాడు. అంతలో వి. హెచ్. హనుమంతురావు ట్రేలో కాఫీ కప్పులతో వచ్చాడు. ముందు కాఫీ తాగండి... ఆ తర్వాత చెబుతాను అని సోనియా అంది. అందరూ కాఫీ తాగాక సోనియా వుండి... మనం విడి విడిగా పోటీచేస్తే ఆ బీజేపీని ఓడించడం కష్టం... మన ఓటు బ్యాంకు చీలిపోకుండా వుండాలంటే అందరం కలిసి కట్టుగా ఒకే కూటమిగా పోటీ చెయ్యాలి. కాబట్టి ఆయా రాష్ట్రాలలో మనం పొత్తులను పరిష్కరించుకోవాలి అని చెప్పింది. పొత్తుల సంగతి తర్వాత ముందు మనలో ప్రధాని అభ్యర్థి ఎవరో తేల్చండి, ఇప్పుడు కాకున్నా ఎలక్షన్ తర్వాతైనా ప్రధాని కుర్చీ కోసం తన్నుకోవాల్సిందేగా అని శరద్ పవార్ అన్నాడు. దానికి సోనియా, నా తుదిశ్వాసలోపు రాహుల్‌ను ప్రధానిగా చూడాలని నా కోరిక. కాబట్టి రాహుల్‌ను పెడదామంది. వెంటనే మాయావతి... ఈసారి ప్రధానిగా దళితబిడ్డకు అది కూడా ఆడబిడ్డకే అవకాశం దక్కాలని డిమాండ్ చేసింది. అప్పుడు మమతా బెనర్జీ... అసలు మోడీకి వ్యతిరేకంగా తొలిపోరాటం మొదలుపెట్టిందే నేను, పీఎం ఛాన్స్ నాదే అంది. ఇక్కడ ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ, ఈ దేశానికి ఎంతో మంది ప్రధానులను అందించిన క్రెడిట్ వున్నోడ్ని... గతంలో రెండుసార్లు ప్రధాని ఛాన్స్‌ను వదులుకున్నాను. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదని చంద్రబాబు సీరియస్‌గా చెప్పాడు. అప్పుడు రాహుల్ కలుగుజేసుకుని... మనం కూటమి కట్టకముందే కొట్టుకుంటే రేపు బీజేపీని ఎలా ఓడించగలం. ప్రధాని పదవిపై నేనొక ఫార్ములా చెబుతాను వినండి... కాంగ్రెస్‌కు 150కన్నా ఎక్కువ సీట్లు వస్తే నేనే ప్రధానిని... మీరందరూ నాకు మద్దతునివ్వాలి. కాంగ్రెస్‌కు 150లోపే వచ్చాయనుకోండి... మీలో ఒకరు ప్రధాని అవుతారు. మీలో ఎవర్ని ఎన్నుకోవాలన్నదానిపై కూడా ఇప్పుడే ఫార్ములా తయారు చేస్తాను. మీ పార్టీలకు కూడా కనీసం ఒక్కో పార్టీకి 20సీట్లు వచ్చి వుండాలి. అలా సీట్లు తెచ్చుకున్నపార్టీ అధినేతల పేర్లను చీటీల మీద వ్రాసి ఒక డబ్బాలో వేస్తాం. ఒక చిన్నపిల్లోడి చేత ఒక చీటీని తీయిస్తాం. అందులో మీలో ఎవరి పేరుంటే వాళ్ళే ప్రధానమంత్రి. మేము గతంలో ఆయా రాష్ట్రాలకు ముఖ్యమంత్రులను ఇలాగే ఎంపిక చేసే వాళ్ళం అని చెప్పాడు. ఈ ఫార్ములాకు మేం ఒకే అని మాయావతి చెప్పింది. ప్రధానిని ఎలా ఎంపిక చేయాలన్నదానిపై స్పష్టత రావడంతో అందరూ అక్కడ నుండి లేచారు.

టెన్‌జనపథ్ నుండి బయటకొచ్చాక ములాయంసింగ్, చంద్రబాబు, శరద్ పవార్, మాయావతి, మమతా బెనర్జీలు ఒక కేఫ్‌లోకి వెళ్ళారు. అక్కడ త్రీబైఫైవ్ టీ ఆర్డర్ చేశారు. మాయావతి వుండి... మనం ప్రధాని ఛాన్స్‌లో రాహుల్‌కు అవకాశం ఇచ్చి వుండకూడదు, మన మంతా ఒక్కటిగా వుంటే చచ్చినట్లు కాంగ్రెసోళ్ళు మనకే మద్దతునిచ్చే వాళ్ళు. రేపు పొరపాటున కాంగ్రెస్‌కు 150సీట్లు దాటితే ప్రధాని ఛాన్స్ అతనికే ఇవ్వాలిగా అని బాధగా చెప్పింది. అందుకు చంద్రబాబు... రాహుల్ ఫార్ములాకు ఒప్పుకోవడానికి మేమేమన్నా అమాయకులమా... ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ. రేపు ఎన్నికల్లో అన్ని రాష్ట్రాలలోనూ పొత్తులలో భాగంగా కాంగ్రెస్‌కు బాగా సీట్లు తగ్గిస్తాం. ఇక కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేసినచోటల్లా మన పార్టీలు వ్యతిరేకంగా పనిచేస్తాయి. కాబట్టి వాళ్ళకు 150సీట్లొచ్చేది లేదు, రాహుల్ ప్రధాని అయ్యేది లేదు... మనకే ఛాన్స్ అని చెప్పాడు. బాబు మాటలతో అందరూ ఆనందపడ్డారు.

★★★★★

టెన్ జనపథ్‌లో నుండి అందరూ వెళ్ళాక సోనియాతో పనబాక లక్ష్మి వుండి... అదేంటమ్మా, ప్రధాని ఛాన్స్ రాహుల్ బాబుకు ఒక్కడికే పెట్టకుండా వాళ్ళకు ఎందుకు అవకాశమిచ్చారు. మనకు 150సీట్లు రాకపోతే ప్రధాని కుర్చీ వాళ్ళకు ఇవ్వాల్సిందేగా అని వాపోయింది. అందుకు సోనియా... ఓసి పిచ్చిమొహమా, ఇటలీ నుండి వచ్చింది, ఇండియా రాజకీయాల గురించి నాకేమీ తెలియదనుకుంటున్నావా, రేపు ఎన్నికల్లో మనతో పొత్తుపెట్టుకునే అన్ని పార్టీలకు సీట్లు తగ్గించి ఇస్తాం... మన మిత్రపక్ష పార్టీల అభ్యర్థులను ఓడించేందుకు మన పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా కృషి చేస్తారు. మన కూటమిలోని ఏ ఇతర పార్టీకి పది సీట్లకు మించి రావు. అప్పుడు ఆటోమేటిక్‌గా ప్రధాని పదవి మన రాహుల్‌దే అని చెప్పింది. అది విని పనబాక లక్ష్మి... మీ బుర్రేబుర్ర... మీ బుర్రేబుర్ర అంటూ సోనియా తలను కళ్ళకు అద్దుకుంది.

## విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలి



'లైఫ్ గోల్స్ ఫిక్సింగ్ అండ్ అచీవింగ్' కార్యక్రమంలో మాట్లాడుతున్న మోటివేషన్ సైకాలజిస్ట్ కె.కృష్ణయ్య

విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ, వివిధ పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను ఇనుమడింపజేసుకోవాలని మోటివేషన్ సైకాలజిస్ట్, ట్రైనర్ కె.కృష్ణయ్య అన్నారు. నెల్లూరులోని శ్రీనేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్‌లో ఈ నెల 4న జరిగిన 'లైఫ్ గోల్స్ ఫిక్సింగ్ అండ్ అచీవింగ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పట్టుదల-లక్ష్యం పట్ల అవగాహన ఉంటే ఏ విద్యార్థి అయినా ఉన్నత శిఖరాలను అందుకోగలడన్నారు. లక్ష్యాన్ని ఎలా సాధించాలనే విషయం పట్ల ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి సుబ్బారెడ్డి, డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డి.వాణి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌విఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పిఎన్ఎం విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం

○ ప్రారంభించిన మేయర్ అజీజ్

నెల్లూరులోని పిఎన్ఎం మహిళా జూనియర్ డేస్కాలర్స్ కళాశాలలో విద్యార్థినులకు ఈనెల 6న నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన పేద విద్యార్థినుల భవిత కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన వారాంతపు పరీక్షల్లో పిఎన్ఎం మునిసిపల్ కళాశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఇక్కడి విద్యార్థినులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నామని, మధ్యాహ్నభోజనంతో పాటు, యూనిఫాం దుస్తులను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఎక్కువగా నిరుపేద ముస్లిం సోదరులు ఉన్న ఈ ప్రాంతంలో విద్యార్థినులు పదవ తరగతి



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్

తర్వాత ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అంటూ, అలాంటి వారి సంప్రదాయాలను గౌరవిస్తూ బాలికలకు ప్రత్యేక కళాశాల ఆవశ్యకతను గర్తించి ఆ మేరకు కళాశాల ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థల బోధనా పద్ధతులు, మెటీరియల్‌తో, నిపుణులైన అధ్యాపక బృందం పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నన్నేసాహెబ్, మున్వర్, మొయినుద్దీన్, షంషుద్దీన్, మౌలానా, హయత్‌బాషా, సాబీర్‌ఖాన్, పాషా మొహిద్దీన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది పూర్ణిమ, రాజేశ్వరి, కళ్యాణి, విజయకుమారి, శాంతారాం, జ్యోతి పాల్గొన్నారు.

## నీటి కరువుతో అల్లాడుతున్న నెల్లూరు

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అటు సాగునీరు, ఇటు తాగునీరు కరువై జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలు అవస్తలు పడుతున్నారని, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఈ సమస్యను పరిష్కరించాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఈ నెల 6న ఏర్పాటు చేసిన ఆ పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం చాలా తక్కువగా నమోదైందని, గత ఏభై ఏళ్లలో ఎప్పుడూ తాగునీటి సమస్య రాని ప్రాంతాల్లో కూడా ఇప్పుడు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే ఈ పరిస్థితిని సమీక్షించి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. జిల్లాలో పార్టీని మరింత పటిష్టవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని, ఈ నెల 15వ తేదీ లోగా శక్తికేంద్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకం జరుగుతుందన్నారు. అదేవిధంగా వచ్చేనెల 15వ తేది లోపు అన్ని బూత్‌లకు పూర్తి స్థాయిలో కమిటీల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఈ నెల 15 నుంచి 21వ తేది దాకా 'భారత్ విజయపర్వం' కార్యక్రమం ద్వారా జాతీయభావంతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను, అవినీతిని ప్రజలకు చాటి చెప్పేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తొలుత, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఆర్‌డి విల్సన్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమరి కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## 10 నుంచి పుస్తక మహోత్సవం

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 19వ తేది వరకు పెద్దఎత్తున పుస్తకమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ కార్యదర్శి లక్ష్మయ్య తెలిపారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 6న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల్లూరు విఆర్‌సి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసే ఈ బుక్‌ఫెస్టివల్‌లో 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, తెలుగు, ఆంగ్లంలో ఉన్న లక్షలాది పుస్తకాలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు, 6 నుంచి 8వరకు సాహిత్య కార్యక్రమాలు ఉంటాయన్నారు.


# ఏకాగ్రతతో లక్ష్యసాధనకు కృషి చేయాలి

## - ఎన్‌బికెఆర్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు




విద్యార్థులు తమ లక్ష్య సాధనకోసం ఏకాగ్రతతో కృషి చేయాలని, ప్రతిఒక్కరూ ఒక మంచి లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ఉన్నత మార్గాల ద్వారా పట్టుదలతో సమున్నతమైన స్థానం సాధించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు. కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థుల కోసం ఎగ్జెంప్లర్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ మొబైల్ ప్రాసెసర్ తయారీసంస్థ అయిన క్వాల్‌కమ్ ఇండియా నుంచి సీనియర్ ఫిజికల్ లెవల్ డిజైన్ ఇంజనీర్ బి.రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్య ద్వారానే విజ్ఞానం కలుగుతుందని, జీవితంలో ఉన్నతస్థానం పొందడానికి విజ్ఞానం ఎంతో అవసరమన్నారు. ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాధరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ప్రతిభాపాటవాలతో రాణించాలన్నారు. అసోసియేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విద్యార్థులంతా తమలోని లోపాలను సరిదిద్దుకుని సమున్నతంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త జి.నాగార్జున రెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్స్, ఆటిట్యూడ్, లీడర్‌షిప్ క్వాలిటీ, టీమ్ మేనేజ్‌మెంట్ మొదలైన విభాగాల్లో రాణించేందుకు అసోసియేషన్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అసోసియేషన్ తరఫున విద్యార్థులకు టెక్నికల్ సింపోజియమ్స్, గ్రూప్ డిస్కషన్స్, క్విజ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కళాశాల సంచాలకులు డా.వివిఎస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 18 నుంచి గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



గొలగమూడిలో కొలువైవున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి 36వ ఆరాధనా మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు వైభవోపేతంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు, ప్రతిరోజు ఉదయం, రాత్రి వేళల్లో ఎంతో వేడుకగా వాహనసేవలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా, 18వ తేది ఉదయం నిత్య పూజల అనంతరం అంకురార్పణ, కలశస్థాపన, శిఖర కలశ సంప్రోక్షణలతో స్వామివారి ఆరాధనా మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు ఉదయం 10 గంటలకు సర్వభూపాల వాహనసేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనసేవలు నిర్వహిస్తారు. 19న ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవలుంటాయి. 20న ఉదయం హనుమంతసేవ, రాత్రి 9గంటలకు హంసవాహనసేవ, 21న ఉదయం చినశేష వాహనం, రాత్రి 9గంటలకు గజవాహనసేవ, 22వ తేది ఉదయం 10గంటలకు అశ్వవాహనసేవ, రాత్రి 9 గంటలకు పెదశేషవాహనసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం10గంటలకు సింహవాహన సేవ, అనంతరం రాత్రి 9గంటలకు కన్నుల పండువగా గరుడవాహన సేవ నిర్వహిస్తారు. స్వామివారి ఆరాధనలో ప్రధానమైన 24వ తేది జరిగే వేడుకలో ఉదయం 10 గంటలకు అంగరంగవైభవంగా రథోత్సవం ఉంటుంది. రాత్రి 8గంటల నుంచి వైభవోపేతంగా స్వామివారికి తెప్పమహోత్సవం జరుగుతుంది. భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆరాధనోత్సవాలకు తరలివస్తారు కనుక వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమకమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# 'అతడు - మేము'.. అక్షర పదునుకు దక్కిన గౌరవం

## - ప్రముఖ కవి కె.శివారెడ్డి



'అతడు-మేము' కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న దేవిప్రియ తదితరులు

అతడు.. మేము కవితా సంకలనం తన అక్షర పదునుకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ కె. శివారెడ్డి పేర్కొన్నారు. శివారెడ్డిపై తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 మంది కవులు రచించిన కవితల్లో ప్రచురితమైన వాటిని నెల్లూరుకు చెందిన సాహితీ మిత్రులు సేకరించి రూపొందించిన 'అతడు.. మేము' కవితా సంకలనాన్ని నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఈనెల 6న ప్రముఖ కవి దేవిప్రియ ఆవిష్కరించారు. శివారెడ్డి మాట్లాడుతూ తన రచనలకు ప్రభావితమైన కవుల స్పందనకు నిదర్శనంగా ఈ కవితా సంకలనం నిలుస్తుందన్నారు. దేవీప్రియ మాట్లాడుతూ సాహిత్య చరిత్ర ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి కొత్త ప్రయోగాలు రచయితలకు వంతెనలా ఉపయోగపడతాయన్నారు. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ కాళిదాసు పురుషోత్తం అధ్యక్షతన, పుస్తక సంపాదకులుగా వ్యవహరించిన సాహితీమిత్రులు ఈతకోట సుబ్బారావు, విల్సన్ రాజు, సుంకోజు దేవేంద్రాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కధకులు ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జయప్రద, శ్రీశ్రీ విశ్వేశ్వరరావులు మాట్లాడారు. తొలుత బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి నిర్వహించిన కవి సమ్మేళనంలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన కవులకు ముఖ్యఅతిధులు బహుమతులు అందజేశారు.. డాక్టర్ ఈదూరు సుధాకర్ వందన సమర్పణ గావించారు.



ప్రముఖ కవి శివారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నవ్యాంధ్ర రచయితల సంఘం సి.ఇ.ఓ చిన్ని నారాయణరావు

# ఆయన.. ఓ విశ్వవిద్యాలయం

## 'పోలూరి జీవితం-సాహిత్యం' గ్రంధావిష్కరణలో డా॥ రేవూరు



పోలూరి హనుమజ్జానకీరామశర్మ మహాపండితుడని, ఎంతోమంది పండితులను, సాహితీ వేత్తలను తీర్చిదిద్దిన ఆయనో మహా విశ్వవిద్యాలయం వంటివారని దూరదర్శన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రేవూరు అనంతపద్మనాభరావు అన్నారు. ఈనెల 8న నెల్లూరు టౌన్‌హాలులో పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోలూరి జీవితం–సాహిత్యం' గ్రంథావిష్కరణ సభలో పాల్గొని పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ప్రతిభాపాటవాలను, సారస్వత వైశిష్ట్యాన్ని వివరించారు. ముఖ్యఅతిథులుగా ఇనమడుగు సత్యానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీహరిస్వామి, బద్దెపూడి కుమారశర్మ, బి.రాఘవేంద్రరావు, డాక్టర్ పి.వి.సుబ్బారావు పాల్గొన్నారు. ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, వేదం వెంకట రాధాకృష్ణ, డాక్టర్ కాళిదాసుపురుషోత్తం, చీమకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# స్నేహభావంతో హాయిగా జీవించాలి



ఇరుగుపొరుగుతో స్నేహభావంతో ఉంటూ, మమతానురాగాలతో అందరూ హాయిగా జీవించాలంటూ నెల్లూరులోని మాడరన్ స్కూల్‌లో చిన్నారులకు ఈనెల 4న ఒక వినూత్న కార్యక్రమం నిర్వహించారు. పేరెంట్స్, స్టూడెంట్స్, టీచర్స్, ఇంటరాక్టివ్ యాక్టివిటీ (పాస్టియా) అనే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఆటపాటల్లో, వివిధ రకాలైన పోటీల్లోనూ పాల్గొన్నారు. స్పాట్ ద డిఫరెన్స్, బెలూన్‌బ్లాస్టింగ్, బ్యాలెన్సింగ్ వాక్, మినియాన్ డ్యాన్స్, క్యాట్‌వాక్, లేజర్‌షో తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మి, వైస్ ప్రిన్సి పాల్ బిందుమాధవి, ఉపాధ్యాయినులు పవిత్ర, సుజాత, సుమజ తదితరులు పాల్గొనగా, బాలకృష్ణ, వివేక్, సంతోష్ సహకరించారు.




# యువత కోసం క్రికెట్ పోటీలు

## నుడా శీనయ్య



యువతను సన్మార్గంలో నడపించడానికి, వారిలో ఉత్తేజం నింపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య పేర్కొన్నాడు. 7వ తేదీ నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువ చైతన్యంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 'ఐ లవ్ నెల్లూరు' పేరుతో నగరాన్ని సుందరబృందావనంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. యువతను క్రీడలలో ప్రోత్సహించడం కోసం ఇటీవల నగరంలో యువ క్రీడాకారులకు 500 క్రీడా కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ నెల 19న నెల్లూరు ఎన్టీఆర్ నగర్ సమీపంలోని ఎస్‌విజిఎస్ కళాశాల మైదానంలో సిబిఎన్ కప్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు ఈ నెల 15వ తేదీలోపు 8919927377 నెంబర్‌కు ఫోన్ చేసి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. నుడా పరిధిలోని కావలి, నాయుడుపేటలలో కూడా స్థానిక నాయకులతో చర్చించి సిబిఎన్ కప్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా పోటీలలో మొదటి బహుమతి కింద లక్ష రూపాయల నగదు బహుకరించనున్నట్లు కోటంరెడ్డి శీనయ్య వెల్లడించాడు.

# ద్రవిడ సూరీడు... అస్తమించాడు



94 ఏళ్ళ జీవితం.. 80 ఏళ్ళ రాజకీయం, 60 ఏళ్ళు శాసనసభ్యత్వం, 18 ఏళ్ళపాటు ముఖ్యమంత్రిత్వం, 50 ఏళ్ళ పార్టీ అధ్యక్షత్వం, 13సార్లు ఓటమి ఎరుగని ఎన్నికల పోరాటం.. అన్నీ కలిసిన ద్రవిడ ఉద్యమ సూర్యుడు కలైంజ్ఞర్ కరుణానిధి అస్తమించారు. దాదాపు ఏడు దశాబ్దాలపాటు తమిళ రాజకీయాల్లో చక్రం తిప్పిన రాజకీయ కురువృద్ధుడు, డిఎంకె అధ్యక్షుడు ఈ నెల 7వ తేది సాయంత్రం కన్నుమూశారు. సుమారు ఒకటిన్నర సంవత్సరకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటున్న ఆయన.. ఇక సెలవంటూ తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారు. ఆయన మృతితో తమిళనాడు శోకసాగరమైంది. ఎటుచూసినా విషాద వాతవరణంతో తమిళనాడంతా ఆవేదనా భరితమైంది. శాశ్వతనిద్రలోకి జారిపోయిన కన్నతండ్రిని చూసి అళగిరి, స్టాలిన్, కనిమొళి తదితరులంతా పెద్ద పెట్టున రోదించారు. ఆయన భౌతిక కాయాన్ని చూసి కుటుంబసభ్యులంతా తీరని దు:ఖంతో తల్లడిల్లిపోయారు. మరో వైపు అభిమానులు, ప్రజల వేదనారోదనలతో తమిళనాట విషాదం ఆవరించింది. ఆయన అంత్యక్రియలకు జనం లక్షల సంఖ్యలో తరలివచ్చారు. ప్రజలంతా ఆయన్ను తలచుకొని కన్నీరుమున్నీరయ్యారు. దేశప్రధాని మోడీతో పాటు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని దేవెగౌడ, ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కెసిఆర్, హెచ్‌డి కుమారస్వామి, పినరయి విజయన్, వివిధపార్టీలకు చెందిన నాయకులు, రజనీకాంత్, కమల్‌హాసన్ వంటి సినీ దిగ్గజాలు, పలురాష్ట్రాల నుంచి అనేక మంది నేతలు, ప్రముఖులంతా తరలివచ్చి ఆయన పార్థివదేహాన్ని కడసారి సందర్శించి కన్నీటి నివాళులర్పించారు.

**ద్రవిడ ఉద్యమ సారథి :**

ద్రవిడ ఉద్యమ సారథిగా విఖ్యాతి చెందిన కరుణానిధి తమిళనాడు రాజకీయాల్ని ఏళ్ళతరబడి ఊగించి శాసించారు. ద్రవిడ ఉద్యమాన్ని సాంఘిక సంస్కరణలకే పరిమితం చెయ్యకుండా రాజకీయ ఉద్యమంగా మార్చి తమిళనాట రాజకీయ రంగాన్నే మార్చివేశారు. బ్రాహ్మణవాద వ్యతిరేకత, సామాజిక న్యాయం, హేతువాదం, నాస్తికత్వం, తమిళభాషా వాదం, హిందీ వ్యతిరేకత వగైరా సిద్ధాంతాల కలయికగా ఉన్న ద్రవిడవాదాన్ని ఒక ఉద్యమంగా రూపుదిద్దిన నాయకుడు కరుణానిధి. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడే పనిచేశారు. జీవితాంతం ఆయన నాస్తికునిగానే జీవితం సాగించారు. కాలక్రమంలో ద్రవిడ ఉద్యమం నీరసపడినా, నేటికీ డిఎంకె మాత్రం నాటి ద్రవిడ ఉద్యమ వాసన మాత్రం కోల్పోలేదు.



1938 ప్రాంతాల్లో రాజకీయాల్లో పాల్గొన్న ఆయన, 1957లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కొద్ది కాలానికి ముఖ్యమంత్రి కూడా అయ్యారు. ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరచుకున్నారు. పరాజయం అన్నదే ఎరుగని ప్రజానాయకునిగా, ఆరుదశాబ్దాల రాజకీయాల్లో ఏనాడూ ఓడని నేతగా తమిళనాట ఆయనకున్న స్థానం.. నాటికీ, నేటికీ.. ఏనాటికైనా...చిరస్మరణీయం.

**రాజీలేని పోరాటయోధుడు:**

కవిగా, రచయితగా, కళాకారునిగా, రాజకీయనాయకునిగా ఆయన తన జీవితంలో బహుపాత్రలను అద్వితీయంగా పోషించి అందరి ప్రశంసలందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.. కలైంజ్ఞర్ కరుణానిధి. ఆయన హయంలో తమిళనాట ప్రజలకు అనేక పథకాలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో కళలకు, భాషా సంస్కృతులకు ఊతమిచ్చి ఊపునందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, రాష్ట్ర అభ్యుదయం కోసం, తమిళప్రజల అభ్యున్నతి కోసం రాజీలేని పోరాటం సాగించిన మహానేత. ఎన్నెన్నో సంస్కరణలతో ప్రజల చెంతకు పథకాల ఫలితాలను చేర్చిన ప్రజానేత ఆయన. ప్రాంతీయంగా డిఎంకె పార్టీని ఏర్పాటుచేసి, జాతీయస్థాయిలో సైతం సంకీర్ణ రాజకీయ బావుటాను ఎగురవేసిన రాజకీయ యోధుడాయన. జీవితాంతం తమిళప్రజల సంక్షేమం కోసం అలుపెరుగని కృషిచేసిన యోధుడు కరుణానిధి లేని లోటు ఏనాటికీ తీరనిది. కరుణ మరణంతో తమిళనాడు ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయింది. ఆయన మృతితో..ఓ శకం ముగిసినట్లయింది.

# పోలీసులపై జూపూడి మాటలు అనుచితం

## పోలీసు అధికారుల సంఘం

రాపూరు ఘటనపై ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. సమర్థవంతంగా పనిచేస్తూ రాపూరు ప్రజల ప్రశంసలు అందుకుంటున్న రాపూరు ఎస్‌ఐ లక్ష్మణరావుపై నిందారోపణలు చేయడం తగదని సూచించింది. ఈ నెల 8న పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పోలీసు అధికారులపై అనుచితవ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగంపై అవగాహన ఉన్న మీరు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్న పోలీసు వ్యవస్థపై, పోలీసు అధికారులపై అనుచితవ్యాఖ్యలు చేసి అవమానపరచడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను రక్షించే పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి ఎస్ఐని, సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టడం మీకు చిన్నసమస్యగా కనిపిస్తుందా అని ఆయన అన్నారు. దాడిలో గాయపడిన దళిత కానిస్టేబుల్ మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. సమాజశాంతికి భంగం కలిగించే రౌడీమూకలకు అండగా నిలచి, ప్రాణాలు సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించే దళిత కానిస్టేబుల్ గురించి మీకు బాధ్యత లేదా అని నిలదీశారు. పోలీసు విధులకు హద్దులు నిర్ణయించడం రాజ్యాంగబద్ధమా అని జూపూడిని ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు. మీ అనుచిత వ్యాఖ్యలతో రాష్ట్ర పోలీసులు మనోధైర్యం దెబ్బతిన్నదని, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బేషరతుగా పోలీసు వ్యవస్థకు క్షమాపణ తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంజిఆర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరుపులు తప్ప... మెరుపులేవి?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు అవినీతిపై, ఆయన ఓటు – నోటు కేసుపై సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ అంచనా పెంపుపై విచారణ కోరుతున్నారు.

నిజమే... బీజేపీ నాయకులు కోరుతున్నట్లు తెలుగుదేశం ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరిపిస్తే ఎన్నో బొక్కలు బయటపడతాయి. మరి కేంద్రంలో వుండేది కాంగ్రెస్ ప్రభుత్వమో, కమ్యూనిస్టుల ప్రభుత్వమో కాదు... బీజేపీ ప్రభుత్వమే! మరి చంద్రబాబు అన్ని అక్రమాలకు పాల్పడివుంటే కేంద్రమే విచారణకు ఆదేశించవచ్చుగా? చంద్రబాబు అవినీతిని బయటపెట్టొచ్చుగా? ఆయనను ప్రజల ముందు అవినీతిపరుడని నిరూపించవచ్చుగా? లాలూప్రసాద్ యాదవ్, శశికళ లాంటి వాళ్ళను జైలుకు తోలిన బీజేపీ నాయకులకు చంద్రబాబు పెద్ద లెక్క కాదు కదా!

మరి తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్నో లొసుగులున్నాయని తెలిసినా కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఇంకా కిక్కురుమనడం లేదంటే వాళ్ళ అంచనా వేరేగా వున్నట్లే! చంద్రబాబు అక్రమాలపై విచారణ జరిపించగల స్థితిలో కేంద్రంలోని బీజేపీ వుండి కూడా అందుకు పూనుకోవడం లేదు. అలాంటప్పుడు ఏపి బీజేపీ నాయకులు చంద్రబాబు మీద ఎంతగా అరచి గీ పెట్టుకున్నా దండగే!

# ఓటు బ్యాంకులపై కన్ను

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర విభజనకు ముందువరకు కూడా ఉమ్మడి ఏ.పి రాజకీయాలలో ఒక ఆరోగ్యకరమైన వాతావరణం వుండేది. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి పాటుపడ్డ ప్రభుత్వాలను ఏపి ప్రజలు తిరిగి ఎన్నుకునే వాళ్ళు. అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తే అధికారం నుండి దించేసేవాళ్ళు. ఈ రాష్ట్రంలో 2009 వరకు ఏ ఎన్నికల లోనూ కులం, ధనం ప్రభావం పని చేయలేదు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఈ రెండు అంశాలు పాక్షికంగా పని చేసాయి. వచ్చే ఎన్నికలనాటికి ఈ రెండింటి ప్రభావం మరింత తీవ్రమయ్యే అవకాశాలు లేకపోలేదు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలు ఆయా ఓటు బ్యాంకులను కొల్లగొట్టడం లేదా చీలగొట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. గడిచిన నాలుగేళ్ళ చంద్రబాబు పరిపాలనను చూస్తే రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతవుంది. ఆయన ఇచ్చిన హామీలు కొండంత వుంటే... వాటిలో నెరవేరుస్తున్నవి గోరంత. అన్ని వర్గాల ప్రజలలోనూ తెలుగుదేశం ప్రభుత్వంపై సానుకూల ధోరణి లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత వుందని చంద్రబాబుకు తెలుసు. కాని, దానిని అధిగమించే ఉపాయాలు కూడా ఈ నలభై ఏళ్ళ అనుభవజ్ఞుడి దగ్గర లేకపోలేదు. రాష్ట్రంలో తెలుగుదేశంకు ఒక సాంప్రదాయ ఓటు బ్యాంకు వుంది. ఇది ఎన్టీఆర్ పార్టీని పెట్టినప్పటి నుండి ఏర్పడ్డ ఓటు బ్యాంకు. చంద్రబాబు ఎంత చెత్తగా పరిపాలన చేసినా ఈ ఓట్లు తెలుగుదేశంకే పడతాయి. చంద్రబాబు సొంత సామాజికవర్గమైన 'కమ్మ'తో పాటు బీసీలు, బ్రాహ్మణ, వైశ్య, గిరిజనులు అత్యధికంగా తెలుగుదేశం ఓటు బ్యాంకుగానే వున్నారు. ఆ ఓట్లు ఎక్కడికీ పోవు. 2014లో టీడీపీలో చేరిన కాపులలో ఎక్కువ శాతం మంది ఆ పార్టీలోనే వుండే అవకాశాలున్నాయి.

రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు గురంతా కూడా వైసిపికి మూల స్థంభమైన మూడు వర్గాల ఓటు బ్యాంకులపైనే! వైసిపికి 'రెడ్డి' సామాజికవర్గం ఆయువుపట్టు. రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలోనూ వీరి రాజకీయ ఆధిపత్యం ఉంటుంది. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు గురి పెట్టింది 'రెడ్ల'పైనే! వైసిపిలో గెలిచిన ఈ వర్గం ఎంపీ, ఎమ్మెల్యేలను కొందరిని తన పార్టీలోకి లాక్కున్నాడు. పదవుల్లోనూ ఈ వర్గంకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఆరు జిల్లాల్లోనూ సాధ్యమైనంతవరకు 'రెడ్ల' ఓట్లలో చీలిక తేవడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తున్నాడు. వైసిపికి అతిపెద్ద ఓటు బ్యాంకులు క్రిస్టియన్లు, ముస్లింలు. 2014 ఎన్నికల్లో ఈ రెండు వర్గాలు జగన్‌కే అండగా నిలిచాయి. వై.యస్. కుటుంబం క్రైస్తవ ఆచారాలను అనుసరిస్తుండడం వల్ల సహజంగానే క్రైస్తవులలో వైసిపి మా పార్టీ, జగన్ మావాడు అనే అభిప్రాయం ఏర్పడింది. ఇక ఈ రాష్ట్రంలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డిది. ఆయన మీదున్న అభిమానం కొద్దీ ముస్లింలు ఎక్కువ శాతం మంది జగన్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ రెండు వర్గాల ఓట్లలో తన ధన ప్రయోగం ద్వారా చీలిక తెచ్చేందుకు చంద్రబాబు పావులు కదుపుతున్నాడు. ఇప్పుడు ముస్లిం, క్రైస్తవ సభలకు శ్రీకారం చుట్టారు. ఈ సభలలో రెండు వర్గాల వారికి ప్రత్యేక తాయిలాలు ప్రకటించనున్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ రెండువర్గాల ఓటు బ్యాంకులు లక్ష్యంగా డబ్బు వెదజల్లబోతున్నారు. చంద్రబాబు ఎత్తుగడ ఫలించి ఈ రెండు ఓట్ల బ్యాంకులలో చీలిక వస్తే మాత్రం జగన్‌కు తీరని నష్టం ఖాయం.

అదే సమయంలో తెలుగుదేశం ఓటు బ్యాంకులను జగన్ లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతున్నాడు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశంకు అండగా నిలిచిన కాపు ఓటు బ్యాంకు ఈసారి చెల్లాచెదురు కానుంది. కాపు ఓట్లలో ఈసారి అంతో ఇంతో వైసిపికి పెరగవచ్చు. అదే సమయంలో 'కాపు' రిజర్వేషన్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలు బీసీల అభిమానానికి పాత్రమయ్యాయి. కాపు రిజర్వేషన్ పేరుతో చంద్రబాబు అటు బీసీలను ఇటు కాపులను మభ్యపెడితే... జగన్ మాత్రం ఉన్నది ఉన్నట్లు మాట్లాడి బీసీల మన్ననలు పొందాడు. ఈసారి బీసీ ఓటు బ్యాంకులో కొంతవరకైనా చీలిక వచ్చి వైసిపికి ప్రయోజనం కలగవచ్చు. గత ఎన్నికల్లో టీడీపీకి గట్టి అండగా నిలిచిన బ్రాహ్మణులు ఈసారి చంద్రబాబును గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఐ.వి.కృష్ణారావు, రమణదీక్షితుల వివాదాలు, పుష్కరాల పేరుతో గుళ్ళను కూలగొట్టడం వంటి సంఘటనలు బ్రాహ్మణులలో టీడీపీపై వ్యతిరేకతను పెంచాయి. అదే సమయంలో జగన్ అందరినీ కలుపుకుంటూ, అందరి విశ్వాసాలను సమంగా ఆదరిస్తుండడం బ్రాహ్మణులను అతని వైపు ఆకర్షించేలా చేసింది. ఇవే కాకుండా జగన్ తన పాదయాత్రలో పలు కుల సంఘాలకు ఇచ్చిన హామీలు కూడా ఆయా కులాలలో వైసిపి ఓట్ల శాతాన్ని పెంచాయనే చెప్పవచ్చు. రాష్ట్రంలో ఒకరి ఓటుపై ఒకరు కన్నేసారన్నది నగ్నసత్యం. తన ఓటు బ్యాంకును కాపాడుకుంటూ అవతల వారి ఓటు బ్యాంకును కాపాడుకుంటూ అవతల వారి ఓటు బ్యాంకును కొల్లగొట్టినవాడే రేపు ఎన్నికల్లో నిలదొక్కుకోగలడు.

ఈ విషయంలో చంద్రబాబు అనుభవం పని చేస్తుందో, జగన్ ముక్కుసూటితనం, మడమతిప్పని నైజం ఫలితాన్ని ఇస్తుందో వేచిచూద్దాం!

### రాజ్యసభ సాక్షిగా...

# బలపడిన కాంగ్రెస్ - 'దేశం' బంధం

- డిప్యూటీ ఛైర్మెన్ ఎన్నికలో బొక్కబోర్లా పడ్డ బాబు
- ఏపికి ద్రోహం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం పాటించి సమయస్ఫూర్తి చూపిన వైకాపా



జాతీయ రాజకీయాలలో ఎన్డీఏ వ్యతిరేక కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవలే కర్నాటకలో ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీని నిలువరించి ఏకతాటిపై నిలిచిన విపక్షాలన్నీ కూడా బీజేపీని రెండో దెబ్బ కొట్టడానికి సిద్ధపడ్డాయి. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మెన్ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థిని ఓడించడం ద్వారా తమ సత్తాను చాటాలనుకున్నాయి. ఎన్డీఏకు ప్రమాద సంకేతాలను అందించాలనుకున్నాయి. కాని విపక్షాల పన్నాగాలను పటాపంచలు చేస్తూ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మెన్‌గా ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించుకోవడంలో బీజేపీ నాయకులు విజయం సాధించారు. దీంతో ప్రధాని నరేంద్రమోడీ తన పరువును కాపాడుకోగలిగారు.

లోక్‌సభలో బీజేపీకి సొంతంగా మెజార్టీ వుంది. మిత్రపక్షాలను కలుపుకుంటే లోక్‌సభలో ఆ పార్టీకి తిరుగేలేదు. కాకపోతే మొదటి నుండి ఎన్డీఏ ఇబ్బంది పడుతున్నది రాజ్యసభలోనే! ఇక్కడ ఎన్డీయేతర పక్షాల బలమే ఎక్కువ. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులను ఈ సభలో ఆమోదించడం కష్టసాధ్యంగా మారింది. రాజ్యసభలో ఎన్డీఏకు సంపూర్ణ మెజార్టీ లేని తరుణంలోనే డిప్యూటీ ఛైర్మెన్ ఎన్నిక వచ్చింది. కురియన్ పదవీ కాలం ముగియడంతో కొత్త డిప్యూటీ ఛైర్మెన్‌పై జాతీయ స్థాయి ఆసక్తికర రాజకీయాలు నడిచాయి. కర్నాటకలో వచ్చిన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ బీజేపీ వ్యతిరేక పక్షాలన్నింటిని ఒక్క దారికి తెచ్చి హరిప్రసాద్‌ను తమ అభ్యర్థిగా ప్రతిపాదించాయి. టిఎంసి, ఎన్‌సిపి పార్టీలకు అవకాశమిచ్చినా వాళ్ళు అభ్యర్థులను నిలపడానికి నిరాకరించి కాంగ్రెస్‌కే ఉమ్మడి అభ్యర్థి బాధ్యతను కట్టబెట్టారు.

ఇక ఎన్డీఏ తరపు నుండి దళ్(యు) ఎంపీ హరివంశ్ సింగ్‌ను అభ్యర్థిగా నిలిపారు. 9వ తేదీ రాజ్యసభలో ఓటింగ్ జరిగింది. 125 మంది సభ్యుల మద్దతుతో ఎన్డీఏ అభ్యర్థి హరివంశ్ నారాయణసింగ్ డిప్యూటీ ఛైర్మెన్‌గా విజయం సాధించారు. తొలిసారిగా రాజ్యసభలో ఎన్డీఏ జెండా ఎగిరింది. ఈ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని ఓడించి తన సత్తా చాటుకోవాలనుకున్న చంద్రబాబు కలలు కల్లలయ్యాయి. ఆయన కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో కాంగ్రెస్-టీడీపీల మధ్య ఇంతకాలం తెరచాటుగా సాగుతున్న అక్రమబంధం ఇప్పుడు బహిరంగమైంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌ను అడ్డంగా చీల్చిన కాంగ్రెస్‌కు, అలాగే ప్రత్యేకహోదా ఇవ్వకుండా నానుస్తున్న బీజేపీకి సమదూరం పాటిస్తూ వైసిపి ఓటింగ్‌కు గైర్హాజరు కావడం వారి సమయస్ఫూర్తికి నిదర్శనం.

# స్వచ్ఛ సర్వేక్షణ్ రథాలు ప్రారంభం




ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛసర్వేక్షన్ ప్రచార రథాలను జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణలు ప్రారంభించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఈ రథాలను గ్రామాల్లోకి పంపుతున్నట్లు కలెక్టర్ ముత్యాలరాజు తెలిపారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ సుస్మితారెడ్డి పాల్గొన్నారు.










కొందరు తెలుగుదేశం ఎమ్మెల్యేలకు అధికార గర్వం ఏ స్థాయిలో తలకెక్కిందో అక్కడక్కడా చూస్తూనే వున్నాం. అధికారులను ఇసుకలో జుట్టుపట్టి ఈడ్చి కొట్టడం, సభలు సమావేశాలలో పబ్లిక్‌గా బూతులు తిట్టడం, ఎయిర్‌పోర్టులలో సిబ్బందిపై వీరంగం చేయడం... ఇలా ఎన్నో సంఘటనలున్నాయి. ఎమ్మెల్యేలంటే ప్రజలకు తాము సర్వెంట్లం అనుకోవడం లేదు. తాము దేవలోకం నుండి డైరెక్ట్‌గా ఊడిపడ్డామన్నట్లుగా కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఫీలవుతున్నారు. ఇలాంటి బాపతే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.

### హద్దులు దాటిన...

# అధికార అహంకారం!

- ఛైర్‌పర్సన్‌కే అవమానం
- చోద్యం చూసిన అధికారగణం

అధికార గర్వంతో పాటు నోటి దురుసు బాగా వున్న నాయకుడు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. 2014లో జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక సందర్భంగా జడ్పీ హాల్‌లో అప్పటి కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌పై ఆయన చేసిన వీరంగాన్ని మీడియా ద్వారా రాష్ట్ర ప్రజలందరూ చూసారు. ఇటీవలే తెలుగుదేశం కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు ఇవ్వాలంటూ అధికారులను ఆయన బూతులు తిడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడం కూడా చూసాం. అయితే ఆయన అధికారులను, ప్రతిపక్ష పార్టీ వాళ్ళనే కాదు, సొంత పార్టీ వాళ్ళను కూడా వదలడం లేదు. తాజాగా వెంకటగిరిలో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ.

గ్రామానికి సర్పంచ్, పట్టణానికి ఛైర్మెన్, నగరానికి మేయర్, రాష్ట్రానికి గవర్నర్, దేశానికి రాష్ట్రపతి ప్రథమపౌరులు. ఈ పదవులకు రాజ్యాంగ పరిధిలో ప్రత్యేక గౌరవం వుంది. కేంద్ర మంత్రి అయినా సరే ఒక పట్టణంలోకి వచ్చినప్పుడు ఆ పట్టణ ఛైర్మెన్‌కే మొదటి ప్రాధాన్యత వుంటుంది. రాజ్యాంగబద్ధంగా ఏ హోదాలో వున్నవారైనా గౌరవించాల్సిన పదవులివి. అలాంటి గౌరవం ఇవ్వాల్సిన పదవినే అవమానించేలా ప్రవర్తించాడు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.

ఈ నెల 7వ తేదీన వెంకటగిరి మున్సిపల్ సమావేశం జరిగింది. మున్సిపల్, కార్పొరేషన్ సమావేశాలలో ఛైర్‌పర్సన్‌లు, మేయర్‌లు మాత్రమే అధ్యక్షస్థానంలో వుంటారు. వాటి పరిధిలో సభ్యులు కింద తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటారు. ఎక్స్‌అఫిషియో సభ్యుల హోదాలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానిక సంస్థల సమావేశాలకు హాజరైనా సాధారణ సభ్యుల పక్కనే కూర్చోవాలి. అధ్యక్ష స్థానంలో వున్న మేయర్ లేదా ఛైర్‌పర్సన్‌లను వాళ్ళు తప్పక గౌరవించాలి.

కాని, 7వ తేదీ వెంకటగిరి మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణ ఈ కట్టుబాటు తప్పాడు. ఛైర్‌పర్సన్‌కు ప్రత్యేకంగా వేసివున్న కుర్చీని కమిషనర్‌తో చెప్పి పక్కన పెట్టించాడు. అంతేకాదు, ఛైర్‌పర్సన్‌కు ఒక ప్లాస్టిక్ కుర్చీ వేయించాడు. ఛైర్‌పర్సన్ పక్కనే తనకూ ఒక కుర్చీ వేయించుకున్నాడు. సమావేశాన్ని అలాగే జరిపించాడు. ఎమ్మెల్యే దెబ్బకు జడిసి ఛైర్‌పర్సన్ కుర్చీకున్న గౌరవాన్ని కాపాడాల్సిన కమిషనర్, ఈ విషయంలో కుక్కినపేను అయ్యాడు. జరిగిన సంఘటనతో అవమానంగా ఫీలై ఛైర్‌పర్సన్ దొంతు శారద కంటతడి పెట్టుకుంది.

### తొలి నుండి విభేదాలు...

వెంకటగిరిలో ఎమ్మెల్యే రామకృష్ణకు ఛైర్‌పర్సన్ దొంతు శారదకు మధ్య విభేదాలున్నాయి. మున్సిపల్ వ్యవహారాలలో ఎమ్మెల్యే జోక్యాన్ని, అధికారాన్ని ఆమె అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆమె పట్ల కక్షపూరిత ధోరణితో వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. కాని వ్యక్తి మీద కోపంతో చేసిన పని వల్ల రాజ్యాంగబద్ధమైన పదవినే అవమానించినట్లయ్యింది.

### పార్టీకే డామేజ్...

ఎమ్మెల్యే రామకృష్ణ వ్యవహారశైలి వల్ల ఇక్కడ తెలుగుదేశంకే నష్టం. బీసీ వర్గాలకు చెందిన ఛైర్‌పర్సన్‌ను అవమానించారు. వెంకటగిరి పట్టణంలో శారద వర్గీయులెక్కువ. జరిగిన సంఘటనపై వాళ్లు ఆగ్రహంతో ఉడికిపోతున్నట్లు తెలుస్తోంది.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com